# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

మంగళవారం, మే 19, 2026 | సంపుటి - 20 | సంచిక 240 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

### ముస్లింలకు సిఎం యోగీ ఆదిత్యానాథ్ హెచ్చరిక



లక్నో : ఇకపై రోడ్లపై నమాజ్ చేయడం ఉదరదని యూపి ప్రభుత్వం హెచ్చరించింది. రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేని అన్నారు. 2లో

## ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం

### తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం

### మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి




హైదరాబాద్ : ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నా మని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నె-లకెస్ రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా 2లో



## మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

### ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం

### ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు

### నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన

న్యూఢిల్లీ : భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్- యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో 2లో



## నిజామాబాద్‌కు పంగానామాలు

### ఇచ్చిన హామీలను పట్టించుకోని రేవంత్

### తలెత్తుకోలేక పోతున్న పిసిసి చీఫ్

### మీడియా సమావేశంలో ఎంపి అర్వింద్ విమర్శలు

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ హామీలు ఏమయ్యాయని అన్నారు. ఈ హామీలు నెరవేర్చకపోవడంతో పిసిసి చీఫ్ తతెత్తుకోలేక పోతున్నారని అన్నారు. 2లో



## కేరళ సిఎంగా సతీశన్ ప్రమాణం

### ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్

### హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి

తిరువనంతపురం : కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 2లో



2

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

### ట్రక్కును ఢీకొన్న కంటెయినర్.. పదిమంది మృతి

ముంబై : మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిఒ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొనడంతో పదిమంది దుర్మరణం చెందారు. ముంబై - అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో

## నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ



### కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానం

### వారి కృషి అసామాన్యమని మంత్రి అమిత్ షా కితాబు

రాయ్‌పూర్ : దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గడ్ లోని జగదల్పూర్ లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. 2లో




## న్యూక్లియర్ ఆర్థికవ్యవస్థలో ఏపి అగ్రగామి

### న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశ

### యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరంలో లోకేశ్

న్యూఢిల్లీ : ఏపీని భవిష్యత్తు న్యూక్లియర్ ఆర్థికవ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడం తమ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్ననేపథ్యంలో ఇది కీలకంగా మారగలదని పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం సంయుక్తంగా యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా పేరిట యూఎస్ న్యూక్లియర్ ప్రతినిధులతో సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి నారా లోకేశ్ అతిథిగా హాజరై ప్రసంగించారు.

తరువాయి 2లో

## వేగవంతంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు

### మూడు పోర్టుల పనులు ఏడాది చివరికి పూర్తి

### అధికారులతో సమీక్షలో మంత్రి జనార్ధన్ రెడ్డి

అమరావతి : గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల పనులు వేగవంతం చేయాలని ఏపీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాలని దిశానిర్దేశర చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని తెలిపారు.పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంలో సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, పిషింగ్ హార్బర్ల పురోగతిపై మంత్రి సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

తరువాయి 2లో

## నదుల అనుసంధానానికి ఆద్యుడు కె.ఎల్.రావ్



### పట్టిసీమ 5ఏళ్ళలోనే 50వేల కోట్ల సంపద సృష్టించింది.

### కె.ఎల్. రావ్ వర్ధంతి వేడుకల్లో మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి : భారతదేశ నీటిపారుదల చరిత్రను మార్చిన హీరాకుడ్, భాక్రానంగల్, శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి బహుళార్ధక సాధక ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక పాత్ర వహించిన మహోన్నత వ్యక్తి ప్రముఖ ఇంజనీర్ కె.ఎల్. రావు అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. సోమవారం అమరావతి సచివాలయంలో పద్మభూషణ్ డాక్టర్. కె.ఎల్ రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తరువాయి 2లో

# రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి' అని అన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుంటారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఇటీవల పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై నమాజ్‌లను మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వం అనుమతించ డాన్ని తప్పుపట్టారు. ఆయన వ్యాఖ్యలను టీఎంసీ తోసిపుచ్చింది. మైనారిటీలను యోగి ఆదిత్యనాథ్ బెదిరిస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. ఇకపోతే కోర్టు కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. రోడ్లపై నమాజుతో ప్రజలకు ఇబ్బంది క లిగించవద్దని హెచ్చరించింది.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

10 మందికిపైగా మృతిచెందగా, మరో 25 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. ఘటనాస్థలిలోనే పదిమందికి పైగా మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

# న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపి అగ్రగామి

వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉందని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమలు చేస్తున్నామని అన్నారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని చెప్పుకొచ్చారు. ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరితరం రియాక్టర్ సిస్టమ్స్ వంటి ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలు, మాడ్యులర్ తయారీ, సప్లయ్ చైన్ పంపిణీ, స్కేలబుల్ వినియోగం నమూనాలకి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీరంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్‌ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇది భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఏపీకి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. తమకు సువిశాలమైన తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విస్తతమైన పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్ఠాత్మకమైన పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని చెప్పుకొచ్చారు. పర్యావరణ వ్యవస్థ ఆలోచనా విధానం ముఖ్యమని అన్నారు. సాంకేతిక సహకారాలు, తయారీ భాగస్వామ్యాలు, సప్లై చైన్ అభివృద్ధి, ఇంజనీరింగ్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ భాగస్వామ్యాలు, స్కిల్లింగ్, వర్క్‌ఫోర్స్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రమాణాలు, భవిష్యత్తు సాంకేతికల అమలుకు విశ్వసనీయ గ్లోబల్ భాగస్వాములతో పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి యూఎస్ ? ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత మెహ్రా స్వాగతం పలుకగా, న్యూక్లియర్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ ప్రెసిడెంట్, సీఈవో మారియా కోర్స్‌నిక్ హాజరయ్యారు.

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశిరచుకున్నట్లు వెల్లడించారు.మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. క్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు.క జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం

అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷-రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷-డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి?కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్‌స్టలెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ÷ర్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

# కేరళ సిఎంగా సతీశన్ ప్రమాణం

20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

# నిజామాబాద్‌కు పంగానామాలు

సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారన్నారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు గాను కేవలం రూ. 10 కోట్ల నిధులు మాత్రమే యుడిసికి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. అంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని తెలంగాణ సీఎం చెప్పారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి లాంటి జెన్యూన్ పర్సన్‌ని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసిఆర్‌నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ చురకలు అంటించారు.

# తొర్రూర్ లో చదరపు గజం రూ.45,500

### బహదూర్ పల్లిలో చదరపు గజం రూ. 40,500

### రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన

### సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం రాక

హైదరాబాద్,మే18 : రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. ఎటువంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్ తో ఫ్యూచర్ సిటీకి, అవుటర్ రింగ్ రోడ్ కు సమీపంలో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలలోని తొర్రూర్ (66 ప్లాట్లు), కుర్మల్ గుడ (11), బహదూర్ పల్లి (8) ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన 85 ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సోమవారం నాడు బహిరంగ వేలం నిర్వహించారు. పెద్ద అంబర్ పేట లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బహిరంగ వేలంలో పాల్గొన్నబిడ్డర్లు చదరపు గజానికి నిర్దేశించిన దానికంటే అధిక మొత్తంతో ఈ ప్లాట్లను కొనుగోలు చేయడం విశేషం. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం వచ్చిందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం తెలిపారు. తొర్రూల్ లే అవుట్ లో ప్లాట్ ను కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీలు పడుతూ గరిష్టంగా చదరపు గజం స్థలాన్ని రూ.45,500 (నలభైఐదు వేల అయిదు వందలు)కు వేలం పాటలో కొనుగోలు చేశారని ఎండి శ్రీ వి.పి.గౌతం తెలిపారు. ఓఆర్ఆర్, ఆదిభట్ల ఐటి క్యారిడార్ కు సమీపంలో ఉన్న తొర్రూర్ లో 200 -700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్లకు (÷ఔ÷నీబిబ) చదరపు గజానికి కనీస ధర 25 వేల రూపాయలుగా నిర్ధారించగా, సగటున రూ. 32,500 (ముప్పయి రెండు వేల అయిదు వందలు) ధర పలికిందన్నారు. తమకు నచ్చిన భూముల కోసం పోటీ పడుతూ బిడ్డర్లు ఒక దశలో ఎ÷-లాట్ ను దక్కించుకోడానికి దాదాపు ఇరవైసార్లు రేట్లు పెంచారంటే ఇక్కడి భూములకున్న డిమాండ్ అర్ధంచేసుకోవచ్చు. అదే విధంగా ఎయిర్ పోర్టు, ఆర్సీఐకి దగ్గర్లో ఉన్న కుర్మల్ గుడ లో 200 నుంచి 400 చదరపు గజాల విస్తీర్ణంలోని ఎ÷-లాట్లకు చదరపు గజం కనీస ధర 20 వేల రూపాయలుగా నిర్ణయించగా, గరిష్టంగా రూ.27,500 ధర పలికింది.అవుటర్ రింగ్ రోడ్ ను ఆనుకుని ఉన్న బహదూర్ పల్లి ప్రాంతంలో 200 నుంచి 1000 చదరపు గజాల విస్తీర్ణంలోని ఎ÷-లాట్లకు కూడా మంచి ధర పలికింది. ఇక్కడ చదరపు గజం కనీస ధర 27 వేల రూపాయలుగా నిర్ణయించగా, వేలం పాటలో గరిష్టంగా రూ.40,500 (నలభైవేలు ఐదు వందల) రూపాయల ధర పలికింది. వేలం పాటలో సగటున ఈ భూములకు గజం రూ.33,800కు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించిన ఈ బహిరంగ వేలం విక్రయాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 150 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

# కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు

### సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక విభాగం

### ఆశావర్కర్ల గౌరవ వేతనం 3వేలకు పెంపు

### కేరళం సిఎం సతీశన్ కీలక నిర్ణయాలు

తిరువనంతపురం,మే18 : కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కేరళం ముఖ్యమంత్రిగా సోమవారంనాడు ప్రమాణస్వీకారం చేసిన వీడి సతీశన్ తొలి క్యాబినెట్ సమావేశంలోనే కీలక సంక్షేమ, పాలనా సంబంధిత నిర్ణయాలను ప్రకటించారు. జూన్ 15వ తేదీ నుంచి మహిళలకు కేఎస్ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యార్థినులు, రోజువారీ ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనున్నట్టు కూడా ప్రకటించారు. వృద్ధతరం పెరుగుతుండటం, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల హెల్త్‌కేర్, సామాజిక భద్రత, పునరావాసం, సంక్షేమ పథకాలను ఈ ప్రత్యేక శాఖ సమన్వయం చేస్తుందని చెప్పారు. ఆశావర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.3,000కు పెంచుతున్నట్టు కూడా ముఖ్యమంత్రి సతీశన్ ప్రకటించారు. కేరళం హెల్త్‌కేర్ సిస్టంలో ఆశా వర్కర్లు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వర్కర్లు, హెల్పర్లకు రూ.1,000 చొప్పున వేతనం పెంచుతున్నామని, పాఠశాలల్లో వంటపనులు చేస్తున్న వారు, సహాయక సిబ్బంది, ప్రీ-ప్రైమరీ టీచర్లకు అదనంగా రూ.1,000 వేతనం పెంచుతున్నామని చెప్పారు. 2023 నవ కేరళం యాత్ర సందర్భంగా యువజన కాంగ్రెస్ నేతలపై జరిగిన దాడులపై ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం సతీశన్ ప్రకటించారు. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధించేందుకు, జవాబుదారీతనాన్ని పాదుకొలిపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని, రుణాలు, వ్యయం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై పారదర్శకతకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

# మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్-నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమికండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్-నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

# నదుల అనుసంధానానికి ఆధ్యుడు కె.ఎల్.రావ్

డాక్టర్. కె.ఎల్ రావు సేవలు అందరికీ స్ఫూర్తి దాయకం, ఆదర్శనీయం అని అన్నారు.ఈ రోజు అందరం మాట్లాడుకుంటున్న నదుల అనుసంధానం గురించి, దేశంలో మొదటి సారిగా ప్రతిపాదించిన వ్యక్తి కె.ఎల్.రావు అని అన్నారు. అందుకే ఆయన మనకు ఒక స్ఫూర్తి అని మంత్రి నిమ్మల తెలిపారు. దేశంలో కరువు కాటకాలు పోవాలంటే నదుల అనుసంధానం ఒక్కటే మార్గమని, గంగా, మహానది, గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి, వంటి నదుల అనుసంధానంతోనే సాధ్యమౌతుందని ప్రగాఢంగా నమ్మిని వ్యక్తి కె.ఎల్ రావు అని అన్నారు.కె.ఎల్ రావు స్ఫూర్తిని నాడు వాజ్‌పేయ్, నేడు ప్రధాని మోధీ అందిపుచ్చుకున్నారని, ముఖ్యంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పట్టి సీమ నిర్మాణం ద్వారా గోదావరి నుండి కృష్ణాకు గోదావరి జలాలను తరలించి నదుల అనుసంధాన కార్యక్రమానికి భీజం వేశారని తెలిపారు. నాడు 1300 కోట్లతో పట్టిసీమ నిర్మిస్తే, 5ఏళ్ళలోనే 50వేల కోట్ల ఆదాయం సృష్టించిందని స్పష్టం చేశారు. భవిష్యత్ లో కూడా కె.ఎల్ రావు గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళేలా, నదుల అనుసంధానం ద్వారా రాష్టాన్ని సుభిక్షం చేసేలా చంద్రబాబు పని చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, జలవనరుల శాఖ సలహాదారులు వెంకటేశ్వరరావు, ఈఎన్సీలు నరసింహమూర్తి, వరప్రసాద్, సిఈలు,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గోవులను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

### డిజిపి ఆనంద్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

హైదరాబాద్,మే18 : తెలంగాణలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. శనివారం రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు.. రాజకీయ ఒత్తిడికి లోనుకాకుండా పని చేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం.. అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ లేఖలో స్పష్టం చేశారు.

## శంషాబాద్‌లో తప్పిన విమాన ప్రమాదం

### 500 మీటర్ల ఎత్తులో విమానాన్ని ఢీకొన్న పక్షి

హైదరాబాద్,మే18 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం బెంగళూరు నుంచి శంషాబాద్‌కు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతున్న సమయంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. ఆ సమయంలో విమానంలో 76 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. దాదాపు 500 మీటర్ల ఎత్తులో విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు పైలట్ గుర్తించారు. వెంటనే ఈ ఘటనపై అధికారులకు సమాచారం అందించారు. పైలట్ అప్రమత్తతతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం సురక్షితంగా ల్యాండింగ్ అయ్యింది. దీంతో విమానంలోని ప్రయాణికులతో పాటు ఎయిర్‌పోర్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్ట్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విమానాలను పక్షులు ఢీకొన్న ఘటనలు మూడు నమోదు అయినట్లు తెలుస్తోంది. బర్డ్ స్ట్రైక్ ఘటనలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సమీప ప్రాంతాల్లో పక్షుల నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఎయిర్‌పోర్ట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# నటుడు దర్శన్ ఆత్మహత్య అంటూ వదంతులు

## అలాంటిదేమీ లేదని ఖండించిన జైలు అధికారులు

బెంగళూరు,మే18 : కన్నడ చలనచిత్ర నటుడు, ఓ హత్యకేసులో నిందితుడైన దర్శన్ తూగుదీప బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు వదంతులు రావడం సోమవారంనాడు తీవ్ర సంచలనమైంది. దీంతో జైలు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉద్రిక్తత తలెత్తింది. నిజానిజాలను నిర్ధారించేందుకు జైలు సీనియర్ తక్షణ చర్యలు చేపట్టారు. అనంతరం ఈ వదంతుల్లో ఎలాంటి నిజం లేదని ప్రకటించారు. ఆదివారం రాత్రి నుంచే ఈ వదంతలు వ్యాప్తి చెందాయని, దీంతో జైలు ల్యాండ్ లైన్‌కు వరుస ఫోన్లు వచ్చాయని జైలు సిబ్బంది తెలిపారు. అయితే అలాంటి ఘటనలేవీ చోటుచేసుకోలేదని సీనియర్ జైలు అధికారులు ధ్రువీకరించారు. దీనిపై జైళ్ల శాఖ డీజీపీ అలోక్ కుమార్ మాట్లాడుతూ, సినీ నటుడు దర్శన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు వచ్చిన వదంతుల్లో ఎంతమాత్రం నిజం లేదని చెప్పారు. వదంతులు నమ్మి ఎవరూ పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుకు రావద్దని, దర్శన్ క్షేమంగానే ఉన్నారని తెలిపారు. మరోవైపు, మంగళవారంనాడు తన పెళ్లిరోజు అయినందున కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు అనుమతించాల్సిందిగా కోర్టును దర్శన్ కోరారు. దీనిపై కోర్టు ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. నటి పవిత్రాగౌడ్‌కు అసభ్య సందేశాలు పంపినందుకు రేణుకాస్వామి అనే యువకుడిని హత్య చేశారనే ఆరోపణలను దర్శన్ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో మొత్తం 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

# ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

## అమిళనాడు అనుసరిస్తున్న విధానం అనుసరణీయం

## రాష్ట్రాలకు కేంద్ర కేబినేట్ కార్యదర్శి సోమనాథన్ సూచన

హైదరాబాద్,మే18 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన, మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్ లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నా మన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె.రామకృష్ణారావును ఈ-గవర్నెన్స్ విధానంపై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, షీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్పు సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా క్రీడా,యువజన వారోత్సవాలు ప్రారంభం

హైదరాబాద్,మే18 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా క్రీడా,యువజన వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఇందులో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నరు. ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ లో జరిగిన జుంబా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యువజన మరియు క్రీడా వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. 5 కిలోమీటర్ల వాకథాన్ ను జెండా ఊపి మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ఏపీ జితేందర్ రెడ్డి, శివసేన రెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, సోనీ బాలాదేవి ప్రారంభించారు.

# రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

జనగామ,మే18 : జనగామ జిల్లా రఘునాథపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ఢీకొట్టడంతో తండ్రి అక్కడికక్కడే మరణించగా.. తీవ్రంగా గాయపడిన కొడుకు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కొమాళ్ల గ్రామానికి చెందిన అలావత్ బాలాజీ (49) తన కుమారుడు నరేశ్‌తో కలిసి సోమవారం ఉదయం టీవీఎస్ ఎక్సెల్‌పై రాఘవపురం బయల్దేరాడు. ఈ క్రమంలో హనుమకొండ-హైదరాబాద్ జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలాజీ అక్కడికక్కడే మరణించాడు. నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించి స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు వచ్చిన సిబ్బంది నరేశ్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

## భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద

## అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి



హైదరాబాద్,మే18 : మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించకపోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. ఞామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరి÷-టనెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ (ఎఔఞంఅఊ) కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఈఏపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

## 516 ర్యాంక్ సాధించిన హర్షిణి

## అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఐదువేల లోపు ర్యాంకులు

## ఇంజనీరింగ్ లో 10వేల లోపు ర్యాంకులు

## విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం అభినందన

హైదరాబాద్,మే18 : మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సోసైటీ విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్ , ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది విద్యార్థులు క్వాలి÷ అయ్యారు. వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ 46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్ ), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్ ), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు క్వాలి÷ కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాలి÷ కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అరజత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి గారు, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

# నగరంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు

## రాష్ట్రంలో ఆరు గిరిజన మ్యూజియంల ఏర్పాటు

హైదరాబాద్,మే18 : హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కమ్ డైరెక్టర్ సంతోష్ బి.ఎమ్., హాజరయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ శతజయంతి ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీమ్, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలోని ప్రతి రాష్ట్రంలో సాధారణంగా ఒక్క గిరిజన మ్యూజియం మాత్రమే ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో ఆరు గిరిజన మ్యూజియంలు ఏర్పాటుచేయడం గర్వకారణమని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ఆధునిక సమాజంలో గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, విలువలు తదితర వారసత్వ సంపదను భావితరాలకు పరిచయం చేసే ప్రధాన వేదికలుగా మ్యూజియంలు నిలుస్తాయని అన్నారు. అలాగే కుమ్రం భీమ్, రాంజీ గోండ్ వంటి గిరిజన వీరులు ప్రజల హక్కులు, స్వేచ్ఛ, స్వాభిమానాల కోసం చేసిన పోరాటాలు, త్యాగాలు తదితర చారిత్రక అంశాలను యువతకు తెలియజేయడంలో గిరిజన మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు, యువత ఆసక్తిగా నేర్చుకునే విధంగా గిరిజన మ్యూజియం లను ఇంటరాక్టివ్, డిజిటల్ మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే నవంబర్ 15 నాటికి రాంజీ గోండ్ స్మారక గిరిజన స్వాతంత్య సమరయోధుల మ్యూజియంను అత్యాధునిక హంగులతో పూర్తి చేసి, ప్రధానమంత్రిని ఆహ్వానించి ఆవిష్కరించేలా చర్యలు చేపడుతు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ సముజ్వల, మ్యూజియం క్యురేటర్ సత్యనారాయణతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కెబిఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

## సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు

న్యూఢిల్లీ,మే18 : కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోర్టును కోరారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.

# బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

## మత ఆధారిత సంక్షేమ పథకాలు రద్దు

## ఇమామ్‌లు, పూజరులకు గౌరవ వేతనం రద్దు

## అన్నపూర్ణ పథకం కింద అర్హులైన మహిళలకు 3వేల సాయం

కోల్‌కతా,మే18 : సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం సీఎం సువేందు అధికారి అధ్యక్షతన బెంగాల్ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను నిలిపివేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. 2026, జూన్ నుంచి ఈ పథకాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమ కార్యక్రమాలకు మతం రంగు పులమకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని గత టీఎంసీ సర్కార్ ఇమామ్‌లు, ముఅజ్జిన్‌లు, ఆలయ పూజారులకు నెలవారీ గౌరవ వేతనాన్ని అందించిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందించింది. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చిన ఇమామ్‌లు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. అలాగే, మసీదులలో భక్తులను ప్రార్థనకు పిలిచే ముఅజ్జిన్‌లకు కూడా ఇదే విధమైన ఆర్థిక సహాయ అందించారు. ఈ రెండు పథకాలకు నిధులనూ మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ఇచ్చేవారు. పంపిణీ చేశారు. ఇమామ్‌ల మాదిరిగానే హిందూ పూజారులు లేదా పురోహితుల కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఈ పథకం కింద ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పురోహితులు నెలకు రూ.2 వేల గౌరవ వేతనాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఘోర పరాజయం పాలైంది. దీంతో బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే గత టీఎంసీ సర్కార్ అమలు చేసిన మత ఆధారిత సంక్షేమ పథకాలను సువేందు అధికారి రద్దు చేశారు. ఇకపోతే బీజేపీ ప్రభుత్వం పలు ఇతర సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిర్ణయం తీసుకుంది.క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 'అన్నపూర్ణ' పథకం అమలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ఇక, ప్రభుత్వ ఉద్యోగుల కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఆరోగ్య రంగంలో కూడా పెద్ద మార్పులు తీసుకురానున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పీఎం విశ్వకర్మ, పీఎమ్ ఫసల్ బీమా యోజన, పీఎం శ్రీస్కూల్స్ వంటి కేంద్ర పథకాలను కూడా పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ఒక్కసారిగా రద్దు చేయబోమని సీఎం సువేందు అధికారి ఈ సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం.

# బండి భగీరథపై అదనపు సెక్షన్లు

## మరింత పకడ్బందీగా కేసు విచారణ

హైదరాబాద్,మే18 : పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బీఎన్ఎస్ 64(2)(ఓ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ దర్యాప్తు అధికారులు జత చేశారు. దీనిప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు. నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బీఎన్ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు చేసిన ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6ల పరిధిలోకి వస్తాయి. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్టు ఆరోపణలుంటే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తున్నది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే.. నిందితుడికి 20 ఏండ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలున్నాయ

# సికింద్రాబాద్ మోండాలో దారుణం

## మద్యం మత్తులో స్నేహితుడి దారుణహత్య

హైదరాబాద్,మే18 : సికింద్రాబాద్ మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. మద్యం మత్తులో తలెత్తిన చిన్నపాటి వివాదం ఒకరి ప్రాణం తీసే వరకు వెళ్లింది. తనతో పాటే కూర్చొని మద్యం సేవించిన స్నేహితుడినే ఓ వ్యక్తి దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఎన్.టి.పి.సి (ఔఞఖఅ) భవనంలోని ఐదవ అంతస్తులో ఈ ఘటన చోటుచేసుకుంది. నిన్న రాత్రి నర్సింహులు అనే వ్యక్తి, అతని స్నేహితుడు కలిసి అక్కడే మద్యం సేవించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఒక విషయంలో తీవ్రమైన గొడవ మొదలైంది. మద్యం మత్తులో ఉన్న స్నేహితుడు అక్కడే ఉన్న మద్యం సీసాతో నర్సింహులుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తలకు బలంగా గాయం కావడంతో నర్సింహులు ఘటనా స్థలంలోనే రక్తపు మడుగులో కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మోండా మార్కెట్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# సంపాదకీయం

## సంక్షోభాల సృష్టికర్తలు... మన పాలకులు !

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళు తుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పులుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

# సంక్షోభమా లేక అవకాశమా?




ప్రస్తుత సంవత్సరం ప్రారంభంలో భారత ఆర్థిక వృద్ధిపై అంచనాలు 6.8 శాతం నుంచి 7.2 శాతం మధ్యలో ఉన్నాయి. అయితే ఇరాన్‌పై జరిగిన దాడి తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముడి చమురు ధరలు ఆకాశమంటాయి, రూపాయి విలువ తీవ్రంగా పడిపోయింది. ఫలితంగా మూడీస్ సంస్థ 2026లో భారత వృద్ధిరేటు 6 శాతానికి పడిపోతుందని హెచ్చరిస్తోంది. ఇటీవలి తాజా గణాంకాల ప్రకారం భారత వాస్తవ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి 2025-26లో 7.6 శాతంగా ఉంది. అయితే 2026- 27లో ఈ వృద్ధిరేటు మందగిస్తుందని, ఇంధన ధరల పెరుగుదల, ప్రపంచ వాణిజ్య అనిశ్చితుల కారణంగా సవాళ్లు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముందున్న దారి ఏమిటి? రూపాయి బలహీనతను ప్రయోజనంగా మార్చుకోవడం సమంజసమైన మార్గం. ఒక సంవత్సరం క్రితం ఒక డాలర్ విలువ సుమారు 85 రూపాయలు ఉండేది. నేడు అది 96 రూపాయలకు చేరింది. ఫలితంగా భారత ఎగుమతులు చౌకగా, పోటీతత్వంతో మారాయి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఎగుమతి రంగాన్ని ప్రోత్సహించాలి. అంతేకాకుండా విదేశీ కంపెనీలకు భారత్‌లో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి అనువైన వాతావరణాన్ని కల్పించాలి. గ్యాస్‌పై భారత ఆధారపడటం తగ్గించడం తక్షణ అవసరం. ప్రధాని మంత్రి రైతులను సౌర పంపుల వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాలు, జీవఇంధనాలను మరింతగా ప్రోత్సహించాలి. రష్యా రూపాయలకు చమురును విక్రయించడానికి సిద్ధపడితే దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవాలి. ఈ చర్యలు దిగుమతి బిల్లును గణనీయంగా తగ్గించగలవు. ప్రస్తుతం చమురు, బంగారం, ఎరువులు, వంటనూనె, ఎలక్ట్రానిక్స్ ఈ ఐదు వస్తువుల దిగుమతులే భారత మొత్తం దిగుమతుల్లో సగానికి పైగా ఉన్నాయి. దేశీయ వినియోగ డిమాండ్ భారత ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదకశక్తి. ద్రవ్యోల్బణం పెరిగితే వినియోగం దెబ్బతింటుంది. ముఖ్యంగా దిగువ ఆర్థిక వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వాలు చేస్తున్న నగదు బదిలీలు అంతా ఈ వర్గాలను రక్షించడంలో సహాయపడతాయి. మరోవైపు కరోనా సమయంలో చూసినట్లు ప్రీమియం వినియోగ డిమాండ్ స్థితిస్థాపకంగా ఉంటుంది. బలమైన స్టాక్ మార్కెట్లు సంపన్న వర్గాలకు పెట్టుబడుల్లో లాభాలు అందిస్తున్నాయి, తద్వారా వారి వినియోగ సామర్థ్యం పెరుగుతోంది. ఇలాంటి చిన్న విధాన మార్పులు కూడా కావాల్సిన ప్రభావాన్ని చూపగలవు. భారత ఆర్థిక దృశ్యంలో మరో ముఖ్యమైన సవాల్ నిరుద్యోగ సమస్య. 2026లో యువత నిరుద్యోగిత రేటు 15 శాతానికి చేరింది. 22- 29 సంవత్సరాల వయస్సు గల గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగిత రేటు 33 శాతంగా ఉంది. గ్రాడ్యుయేట్లలో సుమారు 40 శాతం మంది ఉపాధి లేకుండా ఉన్నారు. భారత్‌లో 15 -29 సంవత్సరాల మధ్య 367 మిలియన్ల యువకులు ఉన్నారు. ఇది అద్భుతమైన జనాభా సామర్థ్యం. అయితే విద్యా నైపుణ్యాలకు, సృష్టించబడుతున్న ఉద్యోగాలకు ఎంతో అంతరం ఉంది. ప్రతి సంవత్సరం 50 లక్షల గ్రాడ్యుయేట్లు ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. కానీ తగినంత ఉద్యోగాలు లేకపోవడంతో ఈ విద్యా సామర్థ్యం సరైన ప్రయోజనాలను అందించడం లేదు. జనాభా డివిడెండ్ ప్రయోజనాన్ని పొందడానికి 2030 నాటికి సమయం చాలా కఠినంగా మారుతోంది. ఆ తర్వాత కార్మిక వయస్సు జనాభా వాటా తగ్గడం ప్రారంభమవుతుంది. వాతావరణ మార్పు ప్రభావం కూడా ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టాల్సిన అంశం. ప్రపంచంలోనే అత్యంత వేడిగా ఉండే 100 నగరాల్లో 98 భారత్‌లోనే ఉన్నాయి. వేడి తీవ్రత విపరీతంగా పెరుగుతుండడంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగింది. గత ఏప్రిల్ 25న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 256 జిడబ్ల్యు (గిగావాట్)కు చేరింది. గత ఏడాది ఇదే నెలలో 235 జిడబ్ల్యుగా ఉండేది. గ్రిడ్లపై భారం పెరిగి, లోడ్ షెడ్డింగ్ ప్రమాదం పెరుగుతుంది. ఇది ఉత్పాదన మీద తీవ్ర ప్రభావం చూపిస్తుంది. రైతులు అప్పటికే ఇన్పుట్ ఖర్చులతో పోరాడుతున్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతంలో కొరత ఏర్పడి, వ్యవసాయ ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింటుంది. 2025లో తీవ్ర వాతావరణ ఘటనలు 4,419 మంది ప్రాణాలను బలితీసుకున్నాయి, 2025లోనే 99 శాతం రోజుల్లో తీవ్ర వాతావరణం నెలకొంది. ఈ మహమ్మారి స్థాయి సంక్షోభం కొనసాగితే ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. తెలుగు రాష్ట్రాలను ప్రత్యేకంగా పరిశీలిస్తే, తెలంగాణ నగరీకరణ రంగంలో దేశాన్నే దాటిపోయింది. కాని.. 2026 నాటికి తెలంగాణలో 50.08 శాతం నగరీకరణ ఉంటుందని అంచనా. ఇది దేశ సగటు 36.01 శాతం కంటే చాలా ఎక్కువ. కృత్రిమమేధ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టెక్నాలజీతో బిల్డింగ్ నిర్మాణ అనుమతుల ప్రక్రియను సామాన్యంగా మారుస్తుంది. బిల్డ్ వేదిక 24 లక్షల చదరపు అడుగుల, 66 అంతస్తుల భవన నిర్మాణ ప్రణాళికను కేవలం 1 నిమిషం 31 సెకన్లలో పరిశీలించి రికార్డు సృష్టించింది. వ్యవస్థకు మంచి సామర్థ్యం ఉంది. కానీ ఇలాంటి సాంకేతిక సామర్థ్యం ఉద్యోగాల కల్పనకు అనువదించబడుతుందా లేదా అనేది ప్రశ్న. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో అమెజాన్ మార్కెట్ వృద్ధి నాలుగు రెట్లు పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి అమెజాన్ దగ్గర 75 వేలకు పైగా విక్రేతలు ఉన్నారు. ఇది డిజిటల్ ఆర్థిక వ్యవస్థ సామర్థ్యానికి సంకేతం. అయితే నిరుద్యోగ సమస్య మాత్రం ఇక్కడా పెద్ద సవాలుగా మిగిలింది. తెలుగు రాష్ట్రాల్లోని యువతకు స్థానిక ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉండటంతో విదేశాల వలసలు పెరుగుతున్నాయి. చివరిగా, ప్రపంచీకరణ అనిశ్చితులు, యుద్ధ ఉద్రిక్తతలు, దేశీయ సమస్యల మధ్య భారత ఆర్థిక వ్యవస్థ కీలకమైన మలుపులో ఉంది. దేశం రెండు మార్గాలను ఎంచుకోవచ్చు. ఒకటి సురక్షితంగా 6 శాతం వృద్ధితో సరిపెట్టుకోవడం, రెండవది బోల్డ్ నిర్ణయాలు తీసుకుని 7 శాతం వృద్ధి లక్ష్యంగా పయనించడం. ప్రస్తుత ఇంధన ధరల సంక్షోభం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారీ సవాళ్లు సృష్టిస్తున్నాయి. కానీ ప్రతి సంక్షోభంలోనూ ఓ అవకాశం ఉంటుంది. భారత ప్రభుత్వం సరైన దృక్పథంతో, సరైన విధానాలతో ముందుకు వెళితే, ఈ సంక్షోభాన్ని ఒక బంగారు అవకాశంగా మార్చుకోవడం సాధ్యమవుతుంది. దేశ భవిష్యత్తు నేడు తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది.

## ఇమ్రాన్ పదవీచ్యుతిలో అమెరికా పాత్ర?

### సంతచలనం కలిగిస్తున్న తాజా వార్తలు



ఇస్లామాబాద్,మే18 : ప్రపంచ దేశాలను అల్లకల్లోలంలోకి నెట్టడం అమెరికా నిత్యం చేస్తూనే ఉంటుంది. తన పట్టును కొనసాగించేందుకు అమెరికా చేయని పనులు లేవు. దానికి సలాం అనకుంటే ఆయా దేశాలను అతలాకుతలం చేస్తుంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు ఇలా విలవిల్లాడినవే. మనదేశంలోనూ వేలుపెట్టపోయి చేతులు కాల్చుకుందని చెబుతారు. తాజాగా పాక్‌లోనూ ఇలాంటి చర్యలకు దిగినట్లు తాజా వార్తలు రుజువు చేస్తున్నారు. పాక్ ప్రధాని పదవి నుంచి ఇమ్రాన్ ఖాన్‌ను తొలగించడం వెనుక అమెరికా హస్తం ఉందని వెల్లడించే రహస్య దౌత్య సమాచారం తాజాగా లీక్ అయ్యింది. దీనికి సంబంధించిన అసలు పత్రాన్ని ఇన్వెస్టిగేటివ్ పత్రిక డ్రాప్ సైట్ ప్రచురించింది. ఇందులో వెల్లడించిన వివరాల ప్రకారం.. 2022, ఏప్రిల్‌లో ఇమ్రాన్‌ఖాన్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అంతకు ముందు అమెరికాలోని పాకిస్థాన్ రాయబారి అసద్ మజీద్ ఖాన్‌తో అమెరికా హోంశాఖలోని దక్షిణ- మధ్య ఆసియా వ్యవహారాల సహాయ కార్యదర్శి డోనాల్డ్ లూ సమావేశమయ్యారు. అందులో వారు ఇమ్రాన్‌ను పదవి నుంచి తొలగించి జైల్లో పెట్టాలని.. అప్పుడే అమెరికా-పాక్ బంధం మరింత బలపడుతుందని చర్చించుకొన్నట్లు తెలుస్తోంది. అనంతరం ఇమ్రాన్ ఖాన్ ప్రధాని పదవి నుంచి వైదొలగడంతో షెహబాజ్ షరీఫ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం విషయంలో ఇమ్రాన్‌ఖాన్ తటస్థ వైఖరి కారణంగానే ఆయన్ను ప్రధాని పదవి నుంచి తప్పించాలని అమెరికా నిర్ణయించినట్లు పాకిస్థాన్‌లో లీకైన దౌత్య సమాచారం వెల్లడించింది. పాక్ రాయబారి, అమెరికా ప్రభుత్వాధికారుల మధ్య భేటీకి ముందు.. ఇమ్రాన్ ఖాన్ పాకిస్థాన్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. తనను పదవి నుంచి తొలగించడానికి స్థానిక పార్టీలు, అధికారులతో కలిసి అమెరికా కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కాగా ఆయన వ్యాఖ్యలను పాక్ ప్రభుత్వం, అమెరికా ఖండించాయి. అనంతరం తోషాఖానా కేసులో ఆయనకు జైలు శిక్ష పడింది. నాటినుంచి ఇమ్రాన్ జైల్లోనే ఉన్నారు. ఇటీవల ఆయనపై హత్యాయత్నం కూడా జరిగిందని వార్తలు వచ్చాయి. మొత్తంగా అమెరికా తీరుతో ప్రపంచ దేశాలు అప్రమత్తంగా ఉండకుంటే అంతే సంగతులు.


## అధిక జ్యేష్ఠం..ఆరంభం

### శుభకార్యాలకు అనువు కాదు

తిరుపతి,మే18 : ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ఆరంభమయ్యింది. అధిక మాసం అంటే అనే సందేహాలు వస్తుంటాయి. ఒకే సంవత్సరంలో ఒకే పేరున్న మాసం రెండు సార్లు వస్తే మొదటిదాన్ని అధికం అని, రెండవదాన్ని నిజమాసమని, శుద్ధం అని అంటారు. హిందూ పంచాంగం చంద్రుడి గమనాన్ని అనుసరిస్తుంది, అయితే గ్రెగోరియన్ క్యాలెండర్ సూర్యుని ఆధారంగా ఉంటుంది. చాంద్రమాన సంవత్సరం సుమారు 354 రోజులు ఉండగా, సౌర సంవత్సరం 365 రోజులు ఉంటుంది. ఈ రెండు మధ్య వచ్చే వ్యత్యాసం వల్ల ప్రతి సంవత్సరం 10,11 రోజుల తేడా ఏర్పడుతుంది. ఈ తేడా ఒక నెలకు చేరినప్పుడు, సుమారు మూడు సంవత్సరాలకు ఒకసారి అదనపు నెలను జోడిస్తారు. దానినే అధిక మాసం అంటారు. ఇది కాలమానం సమతుల్యతను కాపాడడంలో సహాయపడుతుంది. మతపరంగా ఇది ఆధ్యాత్మిక సాధనకు అత్యుత్తమ సమయంగా భావించబడుతుంది. ఈ ఏడాది మే 17, ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం అయ్యింది. 'అసంక్రాంతి మాసో అధికమాసః' అని సనాతన ధర్మశాస్త్రంలో వివరించి ఉంది. అంటే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రయాణించడాన్ని సంక్రమణం లేదా సంక్రాతి అంటారు. ఏ మాసంలో అయితే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రవేశించడో ఆ మాసాన్ని అధిక మాసమని అంటారు. పురాణ కథల ప్రకారం, ఈ అదనపు మాసాన్ని మొదట మల మాసం అని పిలిచేవారు.

## శబ్దం చేసిన ఆనంద తాండవం

శబ్దం అంటే ధ్వని మాత్రమే కాదు. అంతరంగాన్ని కదిలించే అద్భుత సాధనం. శబ్దం అంటే.. ఉచ్చారణ విధానం మాత్రమే కాదు.. శ్వాస నియంత్రణ ద్వారా యోగసాధన చేయించే మార్గం. శబ్దం అనంతశక్తికి నిలయం. విశ్వ ప్రతిస్పందనకు కేంద్రం. సమస్త వ్మాయ ఆవిర్భావానికి శబ్దమే మూలాధారం. అందుకే శబ్దం సాక్షాత్తు పరమేశ్వర స్వరూపం. అనంతమైన శబ్దశక్తితో శివుడినే కదిలించింది 'శివతాండవ స్తోత్రం'. రాక్షస వంశంలో పుట్టినప్పటికీ అఖండమైన శివభక్తిని తనువులోని ప్రతి అణువులో నింపుకొన్నాడు రావణాసురుడు. ఇష్టదైవం పరమేశ్వరుడిని దర్శించుకోవాలనే సంకల్పంతో ఓ రోజు కైలాసానికి చేరుకున్నాడు. ఎంతసేపు నిరీక్షించినా శివుడు కరుణించలేదు. మొత్తంగా కైలాసపర్వతాన్నే పెకలిస్తానంటూ ఆవేశంతో ఊగిపోయాడు. అనుకున్నదే తడవుగా తన ఇరవై చేతులతో కైలాసపర్వతాన్ని పెళ్లగించటం ప్రారంభించాడు. విశ్వమంతా చేష్టలుడిగి చూసింది. పరమేశ్వరి కూడా విస్తుపోయింది. శివుడు మాత్రం ఏమీ పట్టనట్టు ఆనంద తాండవం చేస్తున్నాడు. రావణుడు గాఢమైన మూఢభక్తితో కైలాసాన్ని పెకలిస్తూనే.. ఆర్తితో తన ప్రాణదైవం శివుణ్ని అనేక విధాలుగా స్తోత్రం చేయసాగాడు. రాక్షసుడి నోటి నుంచి అద్భుతమైన స్తోత్రం ఆవిర్భవించింది. 'ఏమిటా అద్భుత వర్ణన%ా% ఏమిటా శబ్ద సౌందర్యం. ఏమిటా ఉపమాన విన్యాసం%ా% అద్భుతం రావణా! భక్తుడవంటే నీవేనయ్యా' అంటూ సృష్టి అంతా ముక్తకంఠంతో ప్రశంసించింది. దశకంఠకృత శివతాండవ స్తోత్రంగా విశ్వవిఖ్యాతి పొంది నేటికీ శివభక్తుల పాలిట కల్పవృక్షంగా ప్రకాశిస్తున్నది ఆ స్తోత్రరాజం. 'అమంత్రం అక్షరం నాస్తి'- మంత్రం కాని అక్షరం లేదంటారు పెద్దలు. బీజాక్షరాల్లోని మంత్రశక్తి ఈ స్తోత్రంలో అంతర్లీనంగా సాగుతుంది. అందుకే శివతాండవ స్తోత్రాన్ని కేవలం స్తోత్రంగా కాకుండా మోక్షానికి దోవ చూపించే యోగసాధన విధానంగా గ్రహించాలి.



ఆధ్యాత్మికం

# నేరం ఒప్పుకున్నోళ్ళేగాదు నేరస్తులకు ఆశ్రయమిచ్చినోళ్ళూ నేరస్తులే....!

- కేంద్ర మంత్రి పదవి నుండి బండిని బర్తరఫ్ చేయాలి
- ముఖ్యమంత్రితో సహ ముగ్గురిపై కేసు నమోదు చేయాలి: మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**మానకొండూర్, మే18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో బండి సంజయ్ ని కేంద్ర మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాళ్ళపల్లి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ శ్రేణులు సోమవారం ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ..... బిజేపి మాటలకు, చేతలకు ఉన్న తేడా కేంద్ర మంత్రి బండి కుమారుడు భగీరథ్ నిర్వాకంతో బట్టబయలైందని, బేటీబచావో,బేటీ పడావో నినాదాలిచ్చే బిజేపి నేడు బేటి బచావో అన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. తనపై అఘాయిత్యానికి పాల్పడ్డాడంటూ ఓ మైనర్ బాలిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే వారంరోజులైనా నిందితుడిని అరెస్టు చేయకపోవడంతో రేవంత్ రెడ్డికి,బండి సంజయ్ కి ఉన్న ఫెవికల్ బందం వల్ల చట్టం ఎవరికి చుట్టంగా పనిచేస్తుందో అర్థమైంతుందన్నారు. ఓ వైపు వడ్ల కొనుగోళ్లు లేక రైతుల మరణాలు, మరో వైపు అమ్మాయిలపై అరచాకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నిస్తూ సామాన్య యువకుల కేసుల్లో తండ్రిని ఇంటరాగేషన్ చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాదితురాలి విషయంలో పూర్తి బాధ్యత వహించాలని కోరారు. 8రోజులపాటు కొడుకును అరెస్టు చేయకపోవడంలో బండి సంజయ్ పాత్ర ఉందని, నేరం ఒప్పుకున్న కొడుకుతో పాటు తన కొడుకును తానే అప్పగించానని చెప్తున్న బండి సంజయ్ పై నేరస్తుడికి ఆశ్రయమిచ్చినందుకు ఏ2గా కేసు నమోదు చేసి వీళ్ళకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఏ3గా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరగాలంటే రామనినాదంతో ధర్మాన్ని పాటించే బండి సంజయ్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని, లేదంటే బండిని బర్తరఫ్ చేసి నరేంద్ర మోడీ తన చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శాతరాజు యాదగిరి, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, బత్తిని కీర్తిలతా గౌడ్, గంప వెంకన్న, గంట మహిపాల్, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, వెన్న అనీల్, నెల్లి మురళీ, బూరుగుపల్లి చంద్రమౌళి, ఆడెపు రమేష్, గోపు ఈశ్వర్ రెడ్డి, రామంచ గోపాల్ రెడ్డి, శామంతుల శ్రీనివాస్ ఆయా మండలాల బిఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు.





# ఈఏపీసెట్ - 2026 ఫలితాలలో "అల్ఫోర్స్" చారిత్రాత్మక విజయం

**కరీంనగర్ టౌన్, మే18(ది క్రైమ్ న్యూస్):** ప్రకటించబడిన ఈఏపీసెట్ - 2026 ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసి ఫలితాలలో "అల్ఫోర్స్" విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి కరీంనగర్ చరిత్రలో కనివిని ఎరుగని ర్యాంకులు సాధించారు. డి.రిత్విక్ (ఆగ్రికల్చర్, ఫార్మసి విభాగములో) 11వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలవగా పి.చరణ్ (ఇంజనీరింగ్ విభాగములో) 22 వ ర్యాంకుతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. సి. హెచ్. లక్ష్మీహసిని (ఇంజనీరింగ్ విభాగములో 74, నిదా (అడఫా) 157, పి.అక్షయ (ఇ) 251, ఎల్. అర్యన్రావు (ఇ)252, మహ్మద్ హూసేన్ (అడఫా) 272, వి. రుచిత (ఆడఫా) 293, ఏ. నాగసింధు (ఇ) 330, బి. అభిఘ్న (ఇ) 430, వి సుహాసిని(ఇ) 439, వి శ్రేయస్ రెడ్డి (ఇ) 487, జై. నయన్ (అడఫా) 505, జి చైత్ర (ఇ) 506, బి.లిఖిత్సాయి (ఇ) 538, ఎల్. అనంతసాయి (అడఫా) 543, కె.అక్షిత (ఆడఫా) 555, జి. లాస్యరెడ్డి (ఇ) 614, జి హర్షిత (అడఫా) 637, టి .హర్షిత (అ డ ఫా) 697, టీ .సహస్ర (ఇ)739, జె. జస్రిత్స సాయి (ఇ)745, డి. విశ్వతేజ (ఇ) 772, యమ్. సిరిమణి (అడఫా) 814, సయ్యద్ మలాజోద్దీన్ (అడ ఫా) 836, షరిన్ఫాతిమా (అడఫా) 898, కె. ధనుష్ (ఇ) 904, పి.చంధన(ఆడఫా) 905, యన్. జస్వంత్సాయి (అడఫా) 921, కె. అక్షయ (ఇ) 951, ఎల్. ప్రణయని(ఇ) 954, ఏన్. రత్నప్రకాశ్ (ఇ) 961, ర్యాంకులతో అల్ఫోర్స్ అఖండ విజయం అందించారు. 32 మంది విద్యార్థులు 1,000 లోపు ర్యాంకు సాధించడం విశేషం. 57 మంది విద్యార్థులు 2,000ల లోపు ర్యాంకులు, 88 మంది విద్యార్థులు 3,000ల లోపు ర్యాంకులు, 127 మంది విద్యార్థులు 4000 ల లోపు 169 మంది విద్యార్థులు 5,000ల లోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్ కీర్తి ప్రతిష్టలను దశదిశలా చాటారని ఈ సందర్భరముగా తెలియజేయు చున్నాను. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక అత్యద్భుత ర్యాంకులు సాదించడం "అల్ఫోర్స్"కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు తెలియజేయు చున్నాయి. ఈ మధ్య ప్రకటించబడిన ఐఐటీ మెయిన్ ఫలితాలలో కూడ "అల్ఫోర్స్" చారిత్రాత్మక విజయం సాదించింది. 450 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్ కు అర్హత సాదించడం "అల్ఫోర్స్" మరో సంచలనం. పటిష్ట ప్రణాళికతో విద్యాబోదన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషివల్ల "అల్ఫోర్స్" ఇంతటి ఘనవిజయాలు సాదించగలు గుతుంది. రాబోయే ఐఐటీ (అడ్వాన్స్) నీట్ ఫలితాలలో కూడ "అల్ఫోర్స్" మహట్నన్నత ర్యాంకులతో ముందంజలో ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. ఈఏ పిసెట్





- 2026 ఫలితాలలో ర్యాంకులు సాదించిన మా "అల్ఫోర్స్" చిన్నారులను, వారి తల్లిదండ్రులను నేను మన:స్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి డా.అల్ఫోర్స్ చెర్మన్ వి.నరేందర్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను అని అన్నారు.

# బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ పై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలి

- తెలంగాణ వీరనారి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పి ఆర్ దేవి

**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్ ):** ఖానాపురం ఆఫీసులో తెలంగాణ వీరనారి మహిళా సంఘం ( రిజిస్ట్రేషన్ నెం : 234) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఖమ్మం జిల్లా సమావేశం సిహెచ్ సత్యవతి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు పి ఆర్ దేవి, సఖి అడ్మిన్ అరుణ పాల్గొని మహిళ స్టడీ సర్కిల్ 50 వారాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు పి ఆర్ దేవి మాట్లాడుతూ బండి భగీరథ్ కేసును పోలీస్ అధికారులు నీరుగార్చే ప్రయత్నం చేయకుండా నిష్పాక్షిక విచారణ జరిపించి బాధితులకు తగిన న్యాయం చేయాలని కోరారు. మైనర్ బాలికల పై మరియు వృద్ధులపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయని వీటిని అరికట్టే ప్రయత్నం ప్రభుత్వాలు చేయాలని కొత్త చట్టాల ద్వారా కఠినమైన శిక్షలు విధించి ఇలాంటి సంఘటనలు పునరుద్ధం కాకుండా చూడాలన్నారు. ఆడపిల్లల చదువు, ప్రయాణాలపై ఆంక్షలు విధించే తాలిబన్ల కొత్త చట్టంను కూడా రద్దు చేయాలని ఇలాంటి విధానాల వల్ల బాల్య వివాహాలు మరింత పెరిగే అవకాశాలున్నాయన్నారు. సఖి అడ్మిన్ అరుణ మాట్లాడుతూ మహిళలపై దాడులు కుటుంబ కలహాలు మైనర్ బాలికల మీద అత్యాచారాలు వీటన్నిటిమీద సఖి సెంటర్ అండగా ఉంటుందని బాధితులకు ఆశ్రయమిస్తుందని వారికి అండగా ఉండి కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి వారి కుటుంబాలను ఏకం చేసి పంపిస్తామని అలాగే సఖి సెంటర్ లో ఉన్నటువంటి



చట్టాలను తెలుసుకొని ప్రజలకు మంచి వారధి లాగా సఖి పనిచేస్తుందని అన్నారు. మహిళా స్టడీ సర్కిల్ నిర్వహించినందుకు ఇంత మంచి కార్యక్రమానికి తమను ఆహ్వానించినందుకు తెలంగాణ వీరనారి మహిళా సంఘం కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వీరనారి మహిళా సంఘం జిల్లా నాయకులు, భూక్య మణి, కటక వెంకటలక్ష్మి, తిప్పర్తిరమ్య, ఇనప నూరి నాగలక్ష్మి, మండల భవాని, ధనాలకోట లత, వి దుర్గాభవాని, కోటేశ్వరి, స్రవంతి, దాసరి మనీ, సంధ్యారాణి, కిరణ్మయి, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కవ్వంపల్లికి ఆశావర్కర్ల వినతిపత్రం



**తిమ్మాపూర్, మే18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీలోని క్యాంపు కార్యాలయంలో తమ సమస్యలపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఆశావర్కర్లు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తుండగా నేటికీ వేతన స్థిరీకరణ చేయక అన్యాయానికి గురవుతున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశాలకు వేతనాలు పెంచడమే కాక ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశావర్కర్లు కోరారు. 50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు, ఆదివారం సెలవుదినంగా ప్రకటించి, పండుగల, ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా రెస్టు రూములు, పనిభారం తగ్గించి, పారితోషికం లేని పనులు చేయించకుండా ప్రభుత్వ పథకాలు, క్వాలిటీ యూనిఫాం ఇవ్వాలని ఆశాలు వినతిపత్రంలో కోరారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు తనవంతు తోడ్పాటునందిస్తానన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సారిక, తిమ్మాపూర్ మండల అధ్యక్షురాలు రజిత తోపాటు సుమారు 50 మంది ఆశావర్కర్లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును లక్ష్యానికి అనుగుణంగా వేగవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### ఫార్మర్ రిజిస్ట్రీలో రాష్ట్రంలో అగ్రస్థానంలో పెద్దపల్లి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీపై సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో పీపీబీ హోల్డర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా 80 శాతం ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును 95 శాతానికి చేర్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకొని అధికారులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా నమోదు శాతం తక్కువగా ఉన్న క్లస్టర్లపై ప్రత్యేక దృష్టి సారించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎం మార్క్ ఫెడ్ గౌరీ నాగేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రత్యేక అవగాహన ర్యాలీని ప్రారంభించిన నగర మేయర్ కోలగాని శ్రీనివాస్






**కరీంనగర్ టౌన్, మే18(ది క్రైమ్ న్యూస్):** స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య భీమాపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు రోడ్డు భద్రతా నియమాలపై చైతన్యం కల్పించేందుకు ప్రత్యేక ర్యాలీని నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ప్రతి కుటుంబానికి ఆరోగ్య భీమా అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనారోగ్య పరిస్థితుల్లో ఆరోగ్య భీమా ఆర్థిక భరోసాను కల్పిస్తుందని ఆయన అన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగుతూ ప్రజలకు ఆరోగ్య భీమా ప్రాముఖ్యత, సురక్షిత డ్రైవింగ్ అవసరంపై సందేశాలు అందించింది. ర్యాలీలో పాల్గొన్న సభ్యులు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏరియా మేనేజర్ కుమార్ గోపు, కదర్ల శ్రీనివాస్ ,మాదాసు సాగర్, చిలుకూరి రమేష్,యేడెల్లి శ్రీనివాస్, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సిబ్బంది, ఏజెంట్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఈఏపీసెట్‌లో కృష్ణవేణి వికాస్ విజయభేరి

### అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగాల్లో మెరుగైన ర్యాంకులు




**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** టీజీ ఈఏపీసెట్-2026 ఫలితాల్లో గోదావరిఖనికి చెందిన కృష్ణవేణి వికాస్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించారు. విద్యార్థుల విజయాలతో కళాశాల మరోసారి తన ప్రతిష్టను చాటుకుంది. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో ఎం. సాత్విక 4585 ర్యాంకు సాధించగా, మెహక్ ఫాతిమున్నిసా 21396 ర్యాంకు పొందింది. ఇంజనీరింగ్ విభాగంలో మహమ్మద్ అజీజ్ 23183, జి. సాయి హర్షిత్ 23675, సిహెచ్. వర్షిత్ 23900 ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ రవికుమార్ నాగండ్ల మాట్లాడుతూ, నాణ్యమైన బోధన, క్రమశిక్షణతో కూడిన అకాడమిక్ షెడ్యూల్, నిత్యనూతన అప్డేట్ స్టడీ మెటీరియల్, వారాంతపు పరీక్షలు, ప్రత్యేక శిక్షణ తరగతులే ఈ విజయాలకు ప్రధాన కారణమన్నారు. ఇంటర్మీడియట్ విద్యతో పాటు ప్రారంభం నుంచే ఈఏపీసెట్ కోచింగ్ అందించడం వల్ల విద్యార్థుల్లో పోటీ ధోరణి పెరిగిందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు గత 13 సంవత్సరాలుగా ఉన్నత స్థాయి విద్య అందిస్తూ కృష్ణవేణి వికాస్ విద్యాసంస్థలు విశ్వసనీయతను నిలబెట్టుకుంటున్నాయని పేర్కొన్నారు. అధ్యాపకుల సమర్థ బోధన, ప్రత్యేక తరగతులు, సగటు విద్యార్థులపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ ఫలితంగానే రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధ్యమయ్యాయని ప్రిన్సిపల్ ఎం. వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నాగండ్ల జమున, రవికుమార్, వైస్ ప్రిన్సిపల్ నర్సింగరావు, ఫిజిక్స్ లెక్చరర్ శ్రీనివాస్, కెమిస్ట్రీ మురళి, మ్యాథ్స్ సుధాకర్, నరేందర్, బోటనీ లెక్చరర్ అనూష, జువాలజీ లెక్చరర్ స్రవంతి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఎల్బీనగర్‌లో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ

### ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ ఫ్లోర్ లీడర్ పార్టీ 41 డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** 41వ డివిజన్ ఎల్బీనగర్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోని డ్వాక్రా గ్రూపులలోని మహిళలకు ఇందిరమ్మ చీరలు అందిస్తున్న క్రమంలో ఈరోజు 41వ డివిజన్ ఎల్బీనగర్లోని స్వయం సహాయక సంఘాల్లోని గ్రూపు మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ ఫ్లోర్ లీడర్ 41 డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య సరే మాట్లాడుతూ రాష్ట్రంలో గత పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన ఆడబిడ్డలందరికీ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం అది కూడా నాణ్యతతో కూడిన చీరలను ఇవ్వడం హర్షించదగ్గ విషయమని సూర్య అన్నారు ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలనను కొనసాగిస్తున్న క్రమంలో డ్వాక్రా మహిళా సంఘాల్లోని మహిళలు రాష్ట్ర ప్రభుత్వ పనితీరులో భాగస్వాములై రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారికి చేరే విధంగా పనిచేయాలని సూర్య విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ నాయకులు రాణవేణి సుధీర్, పోతరాజు నాగరాజు మెప్మా ఆర్పీలు స్వర్ణలత, భాగ్య, సరోజన, పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడం జరిగింది.

# డిసిసి కార్యాలయంలో జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ అత్యవసర సమావేశం

**● మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు,ముఖ్య నేతలు హాజరు**

**కరీంనగర్ టౌన్, మే18(ది క్రైమ్ న్యూస్):** జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన నేడు డిసిసి కార్యాలయంలో జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్న కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో సహ జిల్లాకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా ప్రధానంగా వరి ధాన్యం కొనుగోలు, కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సర్, మంచినీటి సమస్య తదితర అంశాలపై చర్చించడం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నేతలు క్రియాశీలకంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని, ఐకెపి సెంటర్ల వద్ద తాలు, తప్పా పేరుతో తరుగు లేకుండా కొనుగోలు జరిగేలా కాంగ్రెస్ శ్రేణులు పర్యవేక్షించాలని, రైస్ మిల్లర్లు, దళారుల మోసాలను అరికట్టడంలో చొరవ చూపడంతో పాటు జిపిఎస్ విధానం వల్ల లారీల కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను స్థానిక శాసనసభ్యులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కో-ఆర్డినేటర్లు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కరీంనగర్ జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపినారు, ఎస్ఐఆర్ పేరుతో సెక్యులర్ ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, ప్రజలు తమ ఓటు విషయంలో జాగ్రత్తగా ఉండాలి పేర్కొన్నారు. పీసీసీ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బిఎల్ఏ-2 (బూత్ లెవెల్ ఏజెంట్)ల నియామకం వెంటనే పూర్తి చేసి, నియమించిన బీఎల్ఏల పేర్లను ప్రతి నియోజకవర్గం నుండి డిసిసి ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని, బీఎల్ఏల ద్వారా స్థానికంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సహాయం చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యపై సమీక్ష ఈ వేసవి కాలంలో అధిక ఎండల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం, పార్టీ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఇప్పటికే ఆదేశించడం జరిగిందని, నియోజకవర్గాల వారీగా తాగునీటి సమస్యపై కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా





చూడాలని కోరినారు, ప్రజలు, మూగజీవుల కోసం ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, ఆసుపత్రుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించడం జరిగింది. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన కుమార్ మాట్లాడుతూ పార్టీ మరియు నామినేటెడ్ పదవుల నియామకంలో పార్టీలో మొదటి నుండి క్రియాశీలంగా పని చేస్తున్న వారికి గుర్తింపు ఇవ్వాలని, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల నియామకంలో పార్టీ నిర్ణయించిన విధంగా కనీసం మూడు సంవత్సరాలుగా పార్టీలో కొనసాగుతున్న వారికి అవకాశం కల్పించాలనే అంశాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని, కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉన్న కార్యకర్తలకు న్యాయం జరిగేలా అధిష్ఠానం ప్రత్యేక శ్రద్ధ చూపాలని సమావేశం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరు సత్యనారాయణ గౌడ్, హుజురాబాద్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రెహమత్ హుస్సేన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, ఎండి తాజుద్దీన్, పులి ఆంజనేయులు గౌడ్, బోనాల శ్రీనివాస్, మడుపు మోహన్, కాంగ్రెస్ కార్పొరేటర్లు వరాల నరసింగం, ఆకుల నందిని ఉదయ్, టేల భూమయ్య, నాయకులు కంకణాల అనిల్ కుమార్, ఎస్.ఎ మోసీన్, అహ్మద్ అలీ, అబ్దుల్ రెహమాన్, వీర దేవేందర్ పటేల్, పెంట శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'

**● స్పెషల్ డ్రైవ్ ద్వారా చెత్త క్లీనింగ్, శానిటేషన్ కార్యక్రమం**

**కరీంనగర్ టౌన్, మే 18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం సోమవారం ఉదయం 7 గంటలకు ఘనంగా ప్రారంభమైంది. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.యార్డులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో 'యాడ్ క్లీనింగ్ అండ్ శానిటేషన్' ప్రోగ్రామ్‌ను చేపట్టారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి యార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి, శుభ్రం చేశారు.సౌకర్యాల కల్పనకు కట్టుబడి ఉన్నాం మేయర్ అన్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ మార్కెట్‌కు కావలసిన అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించడానికి నగరపాలక సంస్థ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మార్కెట్ ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ క్లీనింగ్ డ్రైవ్, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పంజలా శ్రీనివాస్, మీసాల శంకర్, రివనేని సంపత్, మాలోతు మాలతీ మరియు మార్కెట్ కమిటీ సిబ్బంది, కార్మికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# అన్ని రంగాల కళారులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు, పెన్షన్లు ప్రభుత్వం అందించాలి

**● తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ విడుదల**

**కరీంనగర్ టౌన్, మే18(ది క్రైమ్ న్యూస్):** సమాజంలోని అన్ని రంగాలలో ఉన్న కళాకారులను గుర్తించి వారికి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అందించడంతో పాటు వారందరినీ ఆదుకొనుటకు పెన్షన్లు ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్యమంలి కరీంనగర్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి వరుకోలు సదానందం, దుడ్డేల సమ్మయ్య కోరారు.సోమవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్స్ ను సదానందం,సమ్మయ్య తో పాటు కళాకారులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సదానందం, సమ్మయ్య మాట్లాడుతూ ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవమైన మే 25వ తేదీని పురస్కరించుకొని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర 4వ మహాసభలు మే 25,26వ తేదీలలో రెండు రోజుల పాటు హైదారాబాద్ లో జరిగనున్నాయని ఆ మహాసభలను విజయవంతం చేయడానికి జిల్లా నుండి పెద్దఎత్తున కళాకారులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కళాకారులు పాటలు పాడుతున్నారని, సంస్కృతి, సాంప్రదాయాలను, సామాజిక స్పృహ కలిగించే పాటలు పాడుతూ ప్రజలను చైతన్య వంతం చేస్తున్నారని, అంతరించి పోయే కళలను కనుమరుగు కాకుండా చేసేది కేవలం కళాకారులేనని అలాంటి కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ప్రజా కళాకారులు కొంత మంది మాత్రమే ఉంటారని, కళ కాసుల కోసం కాదు ప్రజల కోసమని పాడే కళాకారులే



ప్రజానాట్య మండలి వారని అన్నారు. జిల్లాలో అనేక మంది కళాకారులు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జానపద, యక్షగాన, బుర్ర కథ, ఒగ్గు కథ, వీధి బాగోత కళారుల బ్రతుకులు చాలా దుర్భరంగా ఉన్నాయని ప్రభుత్వం వారిని గుర్తించాలని కళాకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇవ్వాలని సదానందం, సమ్మయ్య ప్రభుత్వాన్ని కోరారు. వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షురాలు కెంసారం కోమల, సహాయ కార్యదర్శులు జక్కి మంజుల, గుర్రం సదానందం,కోశాధికారి బోలుమల్ల రాజమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు దుడ్డేల రవి, సముద్రాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నూతన విధానాలను కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలి: రాయికంటి శ్రీనివాస్

**మానకొండూర్, మే18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం జగ్గయ్యపల్లిలో ఉపాధి పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ సోమవారం



సందర్శించారు. ఉపాధి హామీలో ఫోటో క్యాప్చర్ విధానం వంటి నూతన నిబంధనలు కూలీలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ఐరిస్ తీసుకోకపోవడంతో పనికి వేతనాలు అందక,సాంకేతిక సమస్యలతో కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో 90% ఇచ్చే నిదులు నేడు 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై 40 శాతం భారం మోపుతుందని, కనీస కూలి 600 ఇచ్చి 200 రోజులు పనులు కల్పించాలని, పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాయికంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## కే ఓ సి. ఎల్ ఎస్ ఎన్ (ఓబి) కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు ఈపీఎఫ్ జమ చేయాలి

**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్ ):** ఇల్లందు డివిజన్ లోని కేఓసి ఎల్ ఎస్ ఎన్ ఓబి కంపెనీలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు గత 12 నెలల నుండి ఈపీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయడం లేదని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఇల్లందు సింగరేణి ఎస్ ఓ టు జి ఎం, మరియు జిఎం పర్సనల్ తుకారాం సార్ గారికి సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్( ఐ ఎఫ్ టి యు) ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు డి ప్రసాద్, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి రాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## బండి సంజయ్ రాజీనామాకు డిమాండ్

### కరీంనగర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల భారీ నిరసన





**కరీంనగర్ టౌన్, మే18(ది క్రైమ్ న్యూస్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగాయి. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ లో భారీ ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ బండి సంజయ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మైనర్ బాలికకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బి.అర్.ఎస్ నేతలు ఫ్లెక్సీ దగ్ధం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు బి.అర్.ఎస్ నేతల చేతుల్లోంచి ఫ్లెక్సీని బలవంతంగా లాక్కున్నారు. దీంతో పోలీసులకు, నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. బండి సంజయ్ మంత్రిగా ఉంటే మైనర్ బాలికకు న్యాయం జరగదని కాబట్టి ఆయన రాజీనామా చేయాలని కోరారు. లేకుంటే ప్రధాని మోదీ బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేసారు.

## ఆరోగ్య రక్షణకు హెల్త్ ఇన్సూరెన్సే అండ

### మెడికవర్ ఆధ్వర్యంలో హెల్త్‌టాక్, ఉచిత వైద్య శిబిరం







**కరీంనగర్ టౌన్, మే18(ది క్రైమ్ న్యూస్):** మనిషి ఒక్కసారి తీవ్ర అనారోగ్యం పాలైతే అప్పటి వరకు దాచుకున్న డబ్బంతా వైద్యానికే ఖర్చవుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో మన సేవింగ్స్‌లో కొంత ఖర్చుపెట్టి హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటే మానసిక ప్రశాంతతతో జీవించవచ్చని కరీంనగర్ మెడికవర్ వైద్యులు తెలిపారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని వీ--పార్క్ హోటల్‌లో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో హెల్త్‌టాక్, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ఉన్న పేషెంట్లకు రోగి ఆర్థిక పరిస్థితిని కాకుండా, అతనికి అవసరమైన వైద్యాన్ని సమయానికి అందించేందుకు ఇన్సూరెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆరోగ్య సమస్య వచ్చిన తర్వాత ఆందోళన చెందడం కంటే ముందుగానే ఆరోగ్యంపై దృష్టి పెట్టడం ఉత్తమమని సూచించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు 150 మందికి నిపుణులైన వైద్యులు సేవలందించారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి తక్షణ రోగ నిర్ధారణ చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆద్వర్యంలో జరిగిన ఈ వైద్య శిభిరం, హెల్త్‌టాక్ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ లోకేష్, డాక్టర్ రాకేష్, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ తాహా, స్టార్ హెల్త్ జోనల్ మేనేజర్ కుమార్ గోపు, డివిజనల్ మేనేజర్ కడార్ల శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ మాదాసు సాగర్, హెచ్ఆర్ హరీష్ బండారి, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## గోదాంగడ్డ స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఘనంగా భూమి పూజ



**కరీంనగర్ టౌన్, మే18(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని 43వ డివిజన్ పరిధిలోని గోదాంగడ్డలో గల స్మశాన వాటిక చుట్టూ రక్షణ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ పొన్నం మొండయ్య-లక్ష్మి తో కలిసి వారు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను శాస్త్రోక్తంగా ప్రారంభించారు.పాల్గొన్న ప్రముఖులు: ఈ భూమి పూజ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ నాంపల్లి శ్రీనివాస్ - రేణుక, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, పండుగ నాగరాజు, బిజెపి నాయకులు, పార్టీ శ్రేణులు, నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్మశాన వాటిక అభివృద్ధికి చొరవ చూపినందుకు స్థానిక ప్రజలు మేయర్ కార్పొరేటర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.సహృద్భావ వాతావరణంలో అల్పాహారం భూమి పూజ అనంతరం నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలంతా కలిసి పొన్నం మొండయ్య హోటల్‌లో అల్పాహారం చేస్తూ, టీ తాగుతూ కాలనీ సమస్యలపై ముచ్చటించారు.

# సమిష్టి కృషితో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

● భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించడానికి కృషి చేయాలి: రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్





**రామగిరి, మే 18(ది క్రైమ్ న్యూస్):-** నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించడంలో భాగంగా సంబంధిత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, అంకిత భావం, సమిష్టి కృషితో, భద్రతతో విధులు నిర్వహించాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తునటువంటి మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలలో భాగంగా సోమవారం రామగుండం-త్రీ ఏరియాలోని ఓసిపి-టు ఉపరితల గని లో నిర్వహించిన కార్యమాన్ని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లడుతూ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించడంతోపాటు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, అంకిత భావం, సమిష్టి కృషితో అందరం భద్రతతో విధులు నిర్వహిస్తూ, ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, పెరుగుతున్న ఖర్చు లను ప్రతి ఉద్యోగి దృష్టిలో ఉంచుకొని డీజిల్ పై ఖర్చు తగ్గిస్తూ యంత్రాలను వినియోగించాలని, మరమ్మత్తులను తగ్గించాలని ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించడానికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో భాగంగా సింగరేణి సాధిస్తున్నటువంటి ప్రగతి, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి చేసినటువంటి ప్రణాళికల గురించి సంబంధిత అధికారులు పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా సంస్థ అభివృద్ధికి సంబంధించి పలువురు ఉద్యోగులు ఇచ్చినటువంటి సలహాలు, సూచనలను సంబంధిత అధికారులు స్వీకరించారు. ఇట్టి అవగాహన సమావేశాలను మూడు బదిలీ(షిఫ్ట్స్) లలో గల ఉద్యోగులకు తెలియజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఎస్వోటుజియంలు బి.వి.సత్య నారాయణ, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ఐఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామారావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ సునీల్ ప్రసాద్, పిట్ సెక్రెటరీలు సురేష్, రామిండ్ల మనోహర్, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# తన మరిది కుమారుడి నుంచి రక్షించాలని కోరిన తల్లి..

● ప్రజావాణిలో ఓ వృద్ధురాలి ఆవేదన కలెక్టర్‌కు వినతి





**బ్యూరో(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఉప్పర మల్యాల గ్రామానికి చెందిన వృద్ధురాలు వేల్పుల రాధమ్మ తన ఇంట్లో ఆశ్రయం కల్పించిన మరిది పెద్ద కుమారుడు వేల్పుల వెంకటేష్ ప్రస్తుతం నా ప్రాణాలకు ముప్పుగా మారాడని, అతడిని వెంటనే నా ఇంటి నుంచి పంపించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా కు పునర్వినతి అందజేసింది. నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. నా భర్త చనిపోయాక అతని పేరు మీద ఉన్న డబ్బులు తీసుకునేందుకు నామిని సంతకం కావాలని చెప్పి నాతో ఒక బాండ్ పేపర్ పై వేలిముద్రలు తీసుకున్నాడు. తీర అది వేరేవారితో చదివిస్తే దత్తత అని రాయించుకున్నట్లు తెలిసింది. అలా మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. నాకు తెలవకుండా తన ఆధార్ కార్డులో నా భర్త పేరు మార్చుకన్నుట్లు తెలిసింది. ఇప్పుడు ఇన్న తన ఆస్తిని తన పేరున రాయాలని ఒత్తిడి చేస్తూ, మానసిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ఒక సందర్భంలో దాడికి కూడా ప్రయత్నించాడని రాధమ్మ తెలిపారు. లీగల్ నోటీసులు పంపిస్తా అంటూ మానసిక వేదనకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో భూమి విక్రయించిన విషయంపై కూడా బెదిరింపులకు పాలపడుతున్నట్లు తెలిపింది. తనతో పాటు నా భూమి కొనుగోలు చేసిన ముస్కు లక్ష్మీ, వేల్పుల శ్రీనివాస్ కుటుంబాలకు కూడా ప్రాణహాని ఉందని పేర్కొంది. తక్షణ పోలీసు రక్షణ కల్పించాలని, అతడిని వెంటనే నా ఇంటి నుంచి ఖాళీ చేయించాలని వేడుకుంది.

## సుల్తానాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మున్సిపల్ అధికారుల ప్రత్యేక సమావేశం





**సుల్తానాబాద్, మే 18(ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణంలోని వైశ్య భవనంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సోమవారం ఒక ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఏమాత్రంఆలస్యం చేయకుండా వెంటనే తమగృహ నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సాంకేతిక, ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, వాటి పరిష్కార మార్గాలపై అధికారుల బృందం అవగాహన కల్పించింది. ఇంకా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానిఅర్హులైన పేదల వివరాలను ఈ సమావేశంలో ప్రత్యేకంగా సేకరించారు. అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీ. రమేష్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏఈ నవ్య, వార్డు అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యమకారులు



**రామగిరి,మే 18(ది క్రైమ్ న్యూస్):-** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమకారులు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల హక్కుల కోసమై జీవో విడుదల చేసిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోతెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ భో గేపద్మ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మట్ట రాజయ్య, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు ఉద్యమకారుల జేఏసీ జిల్లా నాయకులు పోతు కనకయ్య, అంతగిరి సంపత్, పద్మ, నాగవెల్లి నిర్మల, జిల్లా నాయకులు సయ్యద్ రజక్ మైనార్టీ నాయకులు మట్ట రాధా,బొమ్మకల్ రవీందర్, ఆవదుర్తి కళావతి, ఆవదుర్తి శ్రవణ్ తదితర ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

# నగరంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్



**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్ ):** ఖమ్మం నగరంలోని కాల్వ ఒడ్డు ప్రాంతంలో కేబుల్ బ్రిడ్జి పేరుతో ఫ్లైఓవర్ కింద ఉన్నటువంటి షాపింగ్ కాంప్లెక్స్ కూల్చి తాత్కాలిక రోడ్డు పోయడం వల్ల కాల్వ ఒడ్డు నుండి నాయుడుపేట వరకు వెళ్లే మార్గమధ్యంలో లైట్లు లేక వాహనదారులు చాలా ఇబ్బంది గురవుతున్నటువంటి పరిస్థితి ఉన్నది. ఆ ప్రాంతంలో రాత్రిపూట ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉన్నది. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నగర కార్యదర్శి శోభ మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని సుమారు 60 డివిజన్ లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నదని, వారంలో ఒకరోజు మాత్రమే మంచి నీళ్లు వచ్చే పరిస్థితి ఉన్నది. తక్షణమే అధికారులు స్పందించి మంచి నీళ్ల సమస్యలు పరిష్కరించాలని, అదేవిధంగా సిగ్నస్ లైట్ దగ్గర రెండు నిమిషాలు వెయిట్ చేయాల్సిన పరిస్థితి దీనివల్ల వాహనదారులు ఎండ దెబ్బకు గురై అనారోగ్య గురవుతున్నటువంటి పరిస్థితి ఉన్నదని, సిగ్నల్స్ దగ్గర గ్రీన్ పట్టా ఏర్పాటు చేసి వాహనదారులకు సౌకర్యం కల్పించవలసిందిగా డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా టేకులపల్లి కేసీఆర్ టవర్స్ దగ్గర గతవారం రోజులా నుండి మంచి నీళ్లు రావడం లేదు అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకురాలు సిహెచ్ శివమణి, కే శ్రీనివాఎస్, వన్ టౌన్, టూ టౌన్ కార్యదర్శులు లెనిన్, సత్తార్, కొమరయ్య, బొమ్మకంటి రమేష్, జి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్‌పే కంపెనీలో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 22న జాబ్ మేళా : జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఫోన్‌పే కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు ఈ నెల 22 శుక్రవారం జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్‌పే కంపెనీలో మొత్తం 50 బిజినెస్ డెవలప్‌మెంట్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులని, వయస్సు 18 నుంచి 38 సంవత్సరాల మధ్య ఉండాలని అన్నారు. కేవలం పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.18 వేల నుండి రూ.22 వేల వరకు వేతనం అందజేయనున్నట్లు, ఎంపికైన అభ్యర్థులు పెద్దపల్లి, రామగుండం, జమ్మికుంట, మంథని, కాళేశ్వరం, కాటారం, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాలలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మే 22న ఉదయం 11 గంటలకు సర్టిఫికేట్స్ జిరాక్స్ కాపీలు, అప్‌డేటెడ్ బయోడేటా/రెజ్యూమే, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో పాటు అనుభవం ఉంటే ఎక్స్‌పీరియన్స్ లెటర్ తీసుకొని రూమ్ నెంబర్ 233, మొదటి అంతస్తు, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం పెద్దపల్లిలో హాజరై తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి పేర్కొన్నారు.

# అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధం

**సుల్తానాబాద్ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్**
**అసత్య ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా**
**సంఘాన్ని రూ.7 కోట్ల నుండి రూ.40 కోట్లకు చేర్చాం**
**విలేకర్ల సమావేశంలో చైర్మన్ వెల్లడి**




**సుల్తానాబాద్, మే 18 (ది క్రైమ్ న్యూస్):** తనపై వస్తున్న అవినీతి ఆరోపణలను నిరూపిస్తే దేనికైనా సిద్ధమని, అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరంగా పరువు నష్టం దావా వేస్తానని సుల్తానాబాద్ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం సుల్తానాబాద్ సింగిల్ విండో కార్యాలయంలో సంఘ డైరెక్టర్లతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీడ్స్ విత్తనాల అమ్మకాల వ్యవహారంలో బీఆర్ఎస్ నాయకులు నాపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, రాజకీయంగా ఎదుర్కోలేకే ఈ కుట్రకు తెరలేపారని మండిపడ్డారు. గత 13 సంవత్సరాలుగా రైతు సేవలో మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందానని తెలిపారు. సీడ్స్ విక్రయాలకు, సహకార సంఘానికి ఎలాంటి సంబంధం లేదని, ఈ వ్యవహారంపై విజిలెన్స్, టాస్క్ ఫోర్స్ అధికారులు ఇప్పటికే సమగ్ర విచారణ జరిపి నన్ను నిర్దోషిగా తేల్చారని గుర్తుచేశారు. ఏ ఒక్క రైతు వద్దనైనా విత్తనాలు అమ్మి డబ్బులు తీసుకున్నట్లు నిరూపించినా, లేదా సంఘానికి కోట్ల నష్టం జరిగిందని నిరూపించినా ఎలాంటి విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరారు. నిరూపించకపోతే న్యాయ సలహాల మేరకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. గతంలో కేవలం రూ.7 కోట్ల టర్నోవర్‌తో ఉన్న ఈ సంఘాన్ని కష్టపడి ప్రస్తుతం రూ.40 కోట్లకు తీసుకువచ్చామని చైర్మన్ వివరించారు. ఆడిటింగ్‌లో సి గ్రేడ్ నుండి ఏ గ్రేడ్ స్థాయికి చేర్చామని, ప్రస్తుతం సంఘం రూ.25 లక్షల లాభాల్లో నడుస్తోందని చెప్పారు. రైతులకు రూ.75 లక్షల వాటాధనాన్ని కూడా పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూర్బన్ నిధులతో రైతులకు ఉపయోగపడేలా గోదాములు, షెడ్ల నిర్మాణాలు చేపట్టామని, జిల్లాలోని 20 సంఘాలలో సుల్తానాబాద్ సంఘానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో డైరెక్టర్లు కూకట్ల ఓదెలు, సుగుణాకర్, బండ గోపాల్, లచ్చయ్య, కమలమ్మ, గెల్లు పద్మ, సురేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దున్నపోతుల రాజయ్య, మహమ్మద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

## బోనకల్ తహసీల్దార్, ఎస్సైలకు వినతిపత్రం అందజేసిన మెడికల్ అసోసియేషన్ సభ్యులు





**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్ ):** ఈనెల 20 న దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ నిర్వహిస్తున్న సందర్భంగా బోనకల్ తహసీల్దార్, ఎస్ ఐలకు బోనకల్ మండల మెడికల్ షాపుల యజమానులు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇ-ఫార్మసీల అక్రమ నిర్వహణ మరియు 28.08.2018 నాటి జి ఎస్ ఆర్ 817(ఇ) నోటిఫికేషన్ ఉపసంహరణ, పెద్ద కార్పొరేట్ల ద్వారా దోపిడీ ధరల నిర్ణయం అక్రమ ఈ-ఫార్మసీల అనియంత్రిత పెరుగుదల మరియు పెద్ద కార్పొరేట్ సంస్థల దోపిడీ ధరల విధానం, స్థిరపడిన ఔషధ పంపిణీ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిణామాలు చిన్న మరియు మధ్య తరహా కెమిస్ట్ల మనుగడకే కాకుండా, ప్రజారోగ్యానికి కూడా తీవ్రమైన ప్రమాదాలను కలిగిస్తున్నాయన్నారు. ఇదే విషయం పై ఈనెల 20 న దేశ వ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో మెడికల్ షాపు ల అధ్యక్షులు గమిడి సైదులు, శ్రీ సాయి మెడికల్ స్టోర్స్ రావినూతల, ట్రెజరర్ సుగ్గల వెంకట వీర బ్రహ్మాంజనేయులు, లక్ష్మీ వెంకటేశ్వర మెడికల్ స్టోర్స్ బోనకల్, బోనకల్ మండల యూనిట్ సభ్యులు గమిడి కొండలు, శ్రీ వెంకటేశ్వర మెడికల్ స్టోర్స్ రావినూతల వెంకటేశ్వర రావు, శ్రీ వెంకట సాయి మెడికల్ స్టోర్స్ జానకీపురం షేక్ ఖాసీం, సుల్తాన్ మెడికల్ స్టోర్స్ బోనకల్ తదితరులు పాల్గొన్నారు.

## డిజాస్టర్ మేనేజ్ మెంట్ మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు





**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్ ):** వరదలు, ప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు మరియు విపత్కర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలియజేసే రాష్ట్రస్థాయి డిజాస్టర్ మేనేజ్మెంట్ మాక్ డ్రిల్ శిక్షణా కార్యక్రమంలో సోమవారం ఖమ్మం జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు (యువ ఆపద మిత్రలు) పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ హాస్పిటల్ ఖమ్మం నందు జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారి యన్. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతంలో ఖమ్మం జిల్లా నుండి 87 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉస్మానియా యూనివర్సిటీలో ఆపదమిత్ర శిక్షణ పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆపదమిత్ర కోఆర్డినేటర్ మరియు ఖమ్మం జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ యన్. శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పిచ్చయ్య, డాక్టర్ స్వాతి, రాజేశ్వరరావు మరియు వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లను వెంటనే గోదాములకు తరలించాలి

- 9 ప్రాంతాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- కొనుగోలు కేంద్రాలు, గోదాముల వద్ద తగినంత హమాలీలు ఏర్పాటు చేయాలి
- రవాణా కోసం అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు ఆదేశం
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి వెంటనే గోదాములకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న పంట కొనుగోలుపై సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో తొమ్మిది ప్రాంతాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్నను పూర్తిస్థాయిలో సేకరించి గోదాముల్లో నిల్వ చేసే ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలు, దిగుమతి గోదాముల వద్ద తగినంత హమాలీలను సమకూర్చు కోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను వెంట వెంటనే లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్ల ద్వారా గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, రవాణా శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో రవాణా



విషయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత వాహనాలను సిద్ధంగా ఉంచాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గౌరీ నగేష్, రవాణా శాఖ డీటీవో రంగారావు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు చెమటకు ధర లేదు... నాయకుల మాటలకు కొదవ లేదు

- ఆదుకోవడం చేతకాక... ప్రకటనలతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్!"
- వానొస్తే నష్టం... ఎండొస్తే కష్టం... మధ్యలో ప్రభుత్వం మౌనం.
- రైతును రాజును చేస్తామన్నారు... రోడ్డుమీదకు తెచ్చారు: కట్కూరి సందీప్

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** ఎండనక... వాననక... కుటుంబాన్ని పక్కన పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతన్న ఈరోజు ప్రభుత్వ గేట్ల దగ్గర క్యూల్లో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. వరి ధాన్యం, మక్కలు, పొద్దుతిరుగుడు, పత్తి... ఏ పంట చూసినా రైతు కన్నీటి కథే కనిపిస్తోంది. కొనుగోలు కేంద్రాలు తెరిచామని కాగితాలపై గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేలమీద మాత్రం రైతులను రోజుల తరబడి తిప్పలు పెట్టిస్తోంది. సంచులు లేవు... తూకం లేదు... లారీలు రావు... అధికారులు కనిపించరు... చివరికి రైతు ప్రాణం పోతేనే ప్రభుత్వానికి స్పందన వస్తుందా అన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు పంటలను తడిపేస్తుంటే... మరోవైపు కొనుగోళ్ల ఆలస్యం చేసి రైతు నష్టాన్ని రెట్టింపు చేస్తోంది ప్రభుత్వం. కుప్పలుగా పోసిన ధాన్యం మొలకెత్తుతోంది... మక్కలు తడిసి నాణ్యత కోల్పోతున్నాయి... పొద్దుతిరుగుడు గింజలు బూజు పడుతున్నాయి . కానీ పాలకులకేం బాధ? వారికి రైతు కష్టం కనిపించదు... ఫొటోలకు పోజులు ఇవ్వడమే కనిపిస్తుంది! "రైతు కోసం కాదు... రైతు ఓటు కోసం మాత్రమే ప్రేమ!" ఎన్నికల సమయంలో "అన్నదాతే దేవుడు" అంటూ చేతులు జోడించిన నాయకులు... ఇప్పుడు రైతు గోడు వినడానికి కూడా సిద్ధంగా లేరు. రైతు రోడ్డెక్కితే కేసులు... ప్రశ్నిస్తే బెదిరింపులు... ఇదేనా రైతు రాజ్యం? సాగు వ్యయం ఏటేటా భగ్గుమంటోంది. ఎరువుల ధరలు పెరిగాయి... విత్తనాల ధరలు పెరిగాయి... కూలీల ఖర్చులు పెరిగాయి... డీజిల్ ధరలు రైతు నడ్డి విరుస్తున్నాయి. కానీ రైతు పండించిన పంటకు మాత్రం గిట్టుబాటు ధర లేదు! కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు రైతు ఖర్చులకు సరిపోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం పెంచడం లేదు. పంట బీమా సరిగా లేదు. నష్టపోయిన రైతుకు పరామర్శ లేదు. ఇలా సాగు వ్యవస్థను పూర్తిగా సంక్షోభంలోకి నెట్టేస్తున్నారు. "రైతు రాజు అంటారు... కానీ రాజుకు రేషన్ క్యూ అవమానం!" తప్పడంలేదు. రైతు పండించిన ధాన్యాన్ని కొనలేని ప్రభుత్వం... రాష్ట్రాన్ని ఎలా నడుపుతుందనే ప్రశ్న ఇప్పుడు ప్రతి గ్రామంలో వినిపిస్తోంది. పాలకుల నిర్లక్ష్యంతో రైతు అప్పుల్లో కూరుకుపోతున్నాడు. బ్యాంకు వడ్డీలు ఒకవైపు... ప్రైవేట్ అప్పులు మరోవైపు... చివరికి రైతు బతుకే భారమైపోతోంది. రైతు కష్టంతో దేశం బతుకుతోంది. కానీ అదే రైతు కన్నీళ్లతో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటోంది అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "రైతును రాజును చేస్తామని గొప్ప గొప్ప మాటలు చెప్పడం కాదు... ఆచరణలో చేసి చూపించాలి. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులు



చూస్తుంటే ఈ ప్రభుత్వానికి రైతులపై కనీస చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోంది. రైతు పండించిన ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర ఇవ్వాలి. లేకపోతే రైతు ఆగ్రహం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముంచడం ఖాయం అని కట్కూరి సందీప్, పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ కంటెస్టెడ్ క్యాండిడేట్ తీవ్రంగా విమర్శించారు.

# ఎన్నికల వాగ్దానములో ఇచ్చిన హామీ లను భర్తీ చేయాలి..

## అదనపు కలెక్టర్‌కి వినతి పత్రం అందజేసిన బీసీ నాయకులు...

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం లో అదనపు కలెక్టర్ జి. రాజగౌడ్ గారికి బీసీ నాయకుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బీసీ రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మి నారాయణ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానములో ఇచ్చిన హామీ ప్రకారము 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. పెండింగ్ స్కాలర్ షిప్లను విడుదల చేయాచేయాలని డిమాండ్ చేస్తూ..కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోనికి రావడానికి నిరుద్యోగుల ఓట్లే ప్రధాన కారణం. గత ప్రభుత్వం నిరుద్యోగలను నిర్లక్ష్యం చేసినందున వారి యొక్క ఆగ్రహానికి గురియై ఓటమి పాలు అయినారు. శ్రీ రేవంత్ రెడ్డి గారు, శ్రీరాహుల్ గాంధీ గార్లు ప్రతి ఎన్నికల ప్రచారంలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని విస్తృతంగా ప్రచారం చేసి నిరుద్యోగుల నమ్మించినారు. కానీ, అధికారంలోకి వచ్చి రెండున్నర (2 1/2)సంవత్సరాల తర్వాత కూడా నిరుద్యోగులను పట్టించుకోకపోవడం చాలా దారుణం. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 69 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసినారు. ఇంకా వివిధ శాఖలో భారీ ఎత్తున ఖాళీలు ఉన్నాయి. రిటైర్మెంట్ వలన, ప్రమోషన్ల వలన ఏర్పడిన ఖాళీలు భర్తీ చేయలేదు. అలాగే కొత్త జిల్లాలు, కొత్త మండలాలు, అదనపు ఆఫీసులు ఏర్పడిన తర్వాత కూడా అదనపు పోస్టులు సృష్టించడం లేదు. భర్తీ చేయడంలేదు. వీటి యందు ఇంచార్జిలను నియమించుట ద్వారా కార్యకలాపాలు సరిగా కొనసాగడం లేదు. పరిపాలన కుంటు పడుతున్నది. ముఖ్యంగా పోలీస్ శాఖలో 18వేల కానిస్టేబుల్స్, ఎస్.ఐ.లు తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో, ఆదర్శ పాఠశాలల్లో, కస్తూరిబా పాఠశాలల్లో, ఎయిడెడ్ పాఠశాలల్లో కలిపి 30వేల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.. టీచర్ పోస్టులు భర్తీ చేయక పోవడంతో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్, లెక్చరర్ల పోస్టులు 80% ఖాళీగా ఉన్నాయి. కావున రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి, 12000 కోట్ల బీసీ స్కాలర్షిప్ లను విడుదల చేయాలి. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామనిహెచ్చరిస్తూ తెలంగాణ బీసీ రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మి నారాయణ తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం జాయింట్ సెక్రటరీ ఆరె శంకర్ గారు రాష్ట్ర బీసీ నాయకులు వెన్న మహేష్, జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షులు గుంటి గంగారాం, కాసారపు సతీష్ గౌడ్, బందెల మల్లయ్య, సాల్వేర్ రాజేశం, పిండేరు శ్రవణ్ కుమార్, పాపాన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప్పలపాటి శ్రీకాంత్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీలో ఉన్న రామసంద్రం కుంట చెరువు, ఎఫ్‌సీఐ కాలనీలోని పటేల్ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులను సోమవారం తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. చెరువుల్లో మురుగు నీరు కలవకుండా చేపట్టనున్న మురుగు నీటి మళ్లింపు, వరద నీటి కాలువ నిర్మాణ పనులను ఇరిగేషన్ అధికారులు, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రామసంద్రం కుంట చెరువు, పటేల్ చెరువుల్లోకి కలుషిత నీరు చేరకుండా డ్రైనేజీ మళ్లింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులు నాణ్యత ప్రమాణాలతో సాగాలని, ఎక్కడా రాజీ పడకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. చుట్టుపక్కల కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు చెరువుల్లోకి చేరకుండా ప్రత్యేక కాల్వల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. చెరువులను పచ్చదనంతో, ఆహ్లాదకర వాతావరణంతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. పనుల కారణంగా కాలనీ వాసులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ విభాగం డీఈ రాజశేఖర్, ఏఈ గులాం, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ శ్రీదేవి, ఏఈ ప్రశాంత్, సీఎస్ఆర్ ప్రతినిధి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజావాణికి 5 దరఖాస్తులు



**మానకొండూర్, మే18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూమికి సంబంధించి 4, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 1 మొత్తం 5 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. ఎంపీడీవో వరలక్ష్మి, హౌసింగ్ ఏ.ఈ కృష్ణ, పంచాయతీ రాజ్ ఏ.ఈ వెంకన్న, ఐసీడీఎస్ సూపర్వైజర్ రమాదేవి, ఇరిగేషన్ ఏ.ఈ సునంద, గ్రామీణ నీటి సరఫరా ఏ.ఈ నవీన్ తదితరులు తహశీల్దార్ తోపాటు ప్రజావాణి నిర్వహణలో పాల్గొన్నారు.

# హబీబ్స్ హెయిర్ సెలూన్ ప్రారంభం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన రెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన హబీబ్స్ హెయిర్ సెలూన్ షాప్‌ను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హబీబ్స్ సంస్థ ఎండీ అమన్ హబీబ్, ప్రముఖ హీరోయిన్ హిమాజ, తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కొత్త వ్యాపార సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈకార్యక్రమంలో నాయకులు మంత్రిపగడ సత్యనారాయణ, ఓ. వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి, నగేష్, సురేష్ నాయక్, నరేందర్ బల్లా, రమణ రెడ్డి, రాజేందర్,బాబుతదితరులు పాల్గొన్నారు.

# స.హ.చట్టం సాధన కమిటీ మండల ఉపాధ్యక్షుడిగా కనుకుంట్ల సురేష్



**మానకొండూర్, మే18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరుకు చెందిన కనుకుంట్ల సురేష్ సమాచార హక్కు చట్టం సాదన కమిటీ మండల ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో మండల ఉపాధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ కు,సుర స్రవంతి,మల్ల వెంకటేశం, సహకరించిన హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి రంగు మణిదీప్, మండలాధ్యక్షుడు బల్ల నాగరాజుకు కృతజ్ఞతలు తెలుపుతూ సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని బయటకు తీయడంతో పాటు సమాచార హక్కు చట్టంపై పౌరులకు, విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు కృషి చేస్తానని సురేష్ పేర్కొన్నారు.

# జోగి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**తిమ్మాపూర్, మే18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మాజీ ఎంపీటీసీ ఎల్ల జోగిరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే కవ్వంపల్లిసత్యనారాయణ సోమవారం పూలమాలవేసినివాళులర్పించారు.మృతికి కారణాలను తెలుసుకుని ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతిని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేశ్ గౌడ్, సర్పంచ్లు గంకిడి లక్ష్మారెడ్డి, పొన్నాల సంపత్, నాయకులు పోలు రాము, రమేశ్, నగునూరి శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి

**జూలై నుంచి విబిజి రాంజీ పథకంగా పేరు మార్పు: జిల్లా డీఆర్డీఓ అధికారిణి కాలిందిని**



**రామగిరి, మే 18(ది క్రైమ్ న్యూస్):-** జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఆర్డీఓ అధికారిని కాలిందిని అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్, కల్వచర్ల, కమాన్ పూర్ తదితర తదితర గ్రామాలలో ఐకెపి సెంటర్లను ఆమె పరిశీలించారు. రామగిరి జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం (కే.వీ.కే) లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 263 గ్రామపంచాయతీలలో 1.39 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయని, ఇందులో 51,228 మంది కూలీలు యాక్టివ్ గా ఉండగా, ప్రస్తుతం 26 వేల మంది ఉపాధి కూలీలు పనిలోకి వస్తున్నారని తెలిపారు. వేసవికాలం కావడంతో ఉపాధి పనులు జరిగే ప్రాంతాలలో త్రాగునీరు సౌకర్యం కల్పించాలని, చిన్నపాటి షెడ్ లు వేయాలని, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందించాలని ఆమె సూచించారు. ప్రస్తుతం జరిగే పథకం పేరును జూలై నుంచి విబిజి రాంజీ పథకం కింద ప్రభుత్వం మార్చిందని ఆమె తెలిపారు. నూతన పథకంలో 125 రోజులు పని దినాలు కల్పిస్తున్నామని అన్నారు. గొర్రెలు, బర్రెలు, పౌల్ట్రీ కింద షెడ్యూలు నిర్మించుకోవచ్చునని దీనికి పూర్తిస్థాయిలో సబ్సిడీ ఉందన్నారు. రైతులు పోలాలలో వరద కట్టలు నిర్మించుకోవచ్చునని, అజోల, నాడెం కంపోస్ట్ కన్స్ట్రక్షన్ నిర్మించుకోవడానికి భారీగా నిధులు ఉన్నాయని తెలిపారు. స్వశక్తి గ్రూప్ మహిళలకు ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. స్వయం శక్తి పథకాలకు రూ. 5 లక్షల వరకు రుణాలు అందిస్తామని ఆమె తెలిపారు. మహిళలకు డ్రైవింగ్ లో టూ, ఫోర్ వీల్ పై ఉచిత శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో కేంద్రం లో ఆమె పర్యటించారు. అక్కడ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు, ఎంపీడీవో బద్రి శైలజ రాణి, ఉపాధి ఏపీవో వరకొల్ల మౌనిక, కెవికె శాస్త్రవేత్తలు అమనగంటి శ్రీనివాస్, నవ్య రావు, సెక్రటరీ గంగుల సంతోష్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ మల్కా అఖిల, ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

# నిరంతరం ప్రజా సమస్యలపై కృషి

**- బోడుప్పల్ సర్కిల్ ప్రజా సమస్యలపై కమిషనర్‌ను కలిసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కొత్త కిషోర్ గౌడ్ - బోడుప్పల్- చెంగిచెర్ల ప్రాంత అభివృద్ధి అంశాలపై వినతిపత్రం అందజేత... సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన కమిషనర్**



**బోడుప్పల్ (ది క్రైమ్ న్యూస్):** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల, బోడుప్పల్ ప్రాంత సమస్యలపై మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మేడ్చల్ జిల్లా బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డిని కలిశారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.చెంగిచెర్ల,బోడుప్పల్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై చర్చించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగారెడ్డి పాల్గొన్నారు.

# ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కొరకు కౌన్సిలింగ్



**రామగిరి, మే 18(ది క్రైమ్ న్యూస్):-** రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ఆదేశాల మేరకు రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు సోమవారం నాడు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. మొత్తము 200 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 57 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 14 మంది ఉద్యోగులు హాజరై, 12 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఇంచార్జ్ ఎస్వోటు జియం బి.వి.సత్య నారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు గంగాధర్, కోట రవీందర్ రెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వి.సునీల్ ప్రసాద్, సివిల్ విభాగం అధికారి దుర్గం శ్రీనివాస్, ఎస్టేట్స్ విభాగం అధికారి మణిదీప్ రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, దాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల వయస్సులో స్లిమ్‌గా మారాలంటే ఈ 6అలవాట్లను అలవర్చుకోండి.. ఇక మీకు తిరుగుండదంతే..



ప్రస్తుత కాలంలో అధిక బరువు సమస్య చాలామందిని వెంటాడుతోంది. అయితే, బరువు తగ్గించే ప్రయాణాన్ని ఏ వయసులోనైనా ప్రారంభించవచ్చనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, బరువు తగ్గే ప్రయాణంలో శరీర సామర్థ్యం కూడా మారుతుందని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. అందువల్ల, వయస్సు ప్రకారం బరువు తగ్గించే ప్రణాళికను రూపొందించడం చాలా ముఖ్యమంటున్నారు ఆరోగ్య నిపుణులు.. 30 సంవత్సరాల వయస్సులో చాలా మంది ప్రజలు ఊబకాయాన్ని కలిగి ఉంటారు. మీరు కూడా ఇందులో ఒకరిగా ఉన్నట్లయితే, జిమ్‌లో చేరే ముందు, ఖచ్చితంగా ఇక్కడ పేర్కొన్న చిట్కాలను అనుసరించండి. ఎందుకంటే ఇది శరీరాన్ని కొవ్వు రహితంగా మార్చడంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. సాధారణంగా చాలా మంది దీనిని విస్మరిస్తారు.. జిమ్‌కి వెళ్లిన తర్వాత కూడా అలాంటివారు చాలా కాలం పాటు కొవ్వుతో ఇబ్బంది పడుతున్నారు. ఒత్తిడి లేకుండా ఉండటం: 30 ఏళ్ల వయసులో టెన్షన్‌కు లోటు ఉండదు.. కానీ ఒత్తిడి మీ బరువు తగ్గించే ప్రయాణాన్ని నెమ్మదిస్తుందని అర్థం చేసుకోవడం ముఖ్యం.. తక్కువ కేలరీలు తీసుకోవడం, తీవ్రంగా వ్యాయామం చేయడం ద్వారా మీరు ఎంత ప్రయత్నించినా బరువు తగ్గరు.. ఈ క్రమంలో తరచూ ఒత్తిడికి గురైతే, బరువు తగ్గడం కూడా కష్టమవుతుంది.. నిద్రకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి: చాలా మంది నిద్రకు ప్రాధాన్యత ఇవ్వరు. అలాంటి వారిలో నిద్రించడానికి లేదా లేవడానికి ఎటువంటి నిర్ణీత సమయం ఉండదు. అంతేకాకుండా 6-7 గంటలు తగినంత నిద్రపోతున్నారా లేదా అనే దానిపై శ్రద్ధ చూపరు. నిద్రలేమి ఊబకాయంతో సహా అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. అటువంటి పరిస్థితిలో మీరు తగినంత సేపు నిద్రపోవడం చాలా ముఖ్యం.. చక్కెర, డైట్ సోడా, ఆల్కహాల్‌కు దూరంగా ఉండండి: 30 సంవత్సరాల వయస్సులో చాలా మంది ప్రజలు చక్కెర, డైట్ సోడా, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవడం ప్రారంభిస్తారు. అటువంటి పరిస్థితిలో, బరువు తగ్గడం చాలా కష్టం అవుతుంది. ఎందుకంటే ఇవన్నీ శరీరంలో కొవ్వును పెంచడానికి పని చేస్తాయి. డైట్ సోడాను క్యాలరీ ఫ్రీ డ్రింక్ అని పిలిచినప్పటికీ, దానికి జోడించిన కృత్రిమ స్వీటెనర్ ఆరోగ్యానికి హానికరం.. జంక్ ఫుడ్స్ కాకుండా ఇంటి ఆహారాన్ని తినండి: జంక్ ఫుడ్స్ తినే వారికి ఊబకాయం అనేది అతిపెద్ద సమస్యగా మారుతుంది. అటువంటి పరిస్థితిలో, మీరు స్థూలకాయాన్ని వదిలించుకోవాలనుకుంటే ముందుగా మీ ఆహారం నుండి జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ పూర్తిగా తొలగించండి. బదులుగా ఇంటి ఆహారాన్ని తినండి. మీకు మీరే వంట చేసుకుంటే ఈ ప్రక్రియ మీకు చికిత్స లాగా కూడా ఉంటుంది. వేగంగా తినడం, ఆకలితో ఉండటం లాంటివి చేయకండి: బరువు తగ్గడంలో ఉపవాస ప్రణాళిక ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ ఇది ఆకలికి పూర్తిగా భిన్నమైనది. ఎందుకంటే ఇందులో మీరు ఆహారాన్ని పూర్తిగా వదులుకోవాల్సిన అవసరం లేదు. బదులుగా, ఇందులో మీరు ఆహారం, నాణ్యత, పరిమాణంపై శ్రద్ధ వహించాలి. మీకు ఆకలిగా అనిపించినప్పుడు మాత్రమే మీరు ఆహారం తినేలా చూసుకోవాలి.. మీ కడుపుని ఎప్పుడూ ఖాళీగా ఉంచకండి.. వేగంగా కూడా తినకండి.. ప్రొటీన్: బరువు తగ్గడానికి ప్రతి భోజనంలో ప్రోటీన్‌ను చేర్చుకోండి.. ఇది జీవక్రియను పెంచుతుంది. ఇంకా కేలరీలను బర్న్ చేయడానికి అవసరం. కండరాలు, ఎముకలను నిర్మించడంలో ప్రోటీన్ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

## కొంపెల్లి గ్రామంలో మహిళపై దారుణ దాడి... బంగారం దోపిడీ యత్నం కలకలం



**నల్గొండ జిల్లా ప్రతినిధి ( ది క్రైమ్ న్యూస్) మే 18:** నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం కొంపెల్లి గ్రామంలో ఆదివారం దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గాలి పద్మ భర్త సైదిరెడ్డి గారు ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి కత్తితో దాడి చేసి బంగారం దోచుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. దుండగులు పద్మ గొంతును తీవ్రంగా కోయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటన స్థలానికి మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు, సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్సై వీరశేఖర్ చేరుకుని వివరాలు సేకరించారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన పద్మ గారిని హాలియాలోని తులసి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

## ట్రాక్టర్ ను డికొన్న డిసిఎం.....ఒకరి మృతి



**తిమ్మాపూర్, మే18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ట్రాక్టర్ ను డికొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గన్నేరువరం మండలం మాదాపూర్ కు చెందిన కాంతాల రాజిరెడ్డి అనే రైతు ట్రాక్టర్ పై కరీంనగర్ వైపు వెళుతున్న క్రమంలో వెనుక నుండి అతివేగంగా వస్తున్న డీసిఎం ట్రాక్టర్ ను ఢీకొట్టి రాజిరెడ్డిపై నుండి వెళ్ళింది. దీంతో రాజిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఆన్లైన్ మందుల విక్రయాలపై చర్యలు తీసుకోండి



**ఇల్లంతకుంట, మే18(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలో ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కెమిస్టుల సమ్మెకు మెడికల్ షాపుల యజమానులు, కెమిస్టులు మద్దతు ప్రకటిస్తూ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సమ్మెకు సంబంధించిన వినతిపత్రాన్ని మండల తహసీల్దార్ సురేష్‌కు, పోలీస్ స్టేషన్ సిబ్బంది సత్యనారాయణకు అందజేశారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ఫార్మసీల వల్ల చిన్న స్థాయి మెడికల్ షాపుల యజమానులు తీవ్రంగా నష్టపోతుండగా కార్పొరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్ల పేరుతో స్థానిక వ్యాపారాలను దెబ్బతీస్తున్నాయని మండిపడ్డారు. నకిలీ మందుల విక్రయాలు పెరిగే ప్రమాదం ఉన్నందున, ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిచ్చి ఆన్లైన్ విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 20న చేపట్టనున్న సమ్మెకు ప్రజలు సహకరించాలని, అత్యవసర మందులను ముందుగానే కొనుగోలు చేసుకోవాలని సూచించారు. జలపతి రెడ్డి, హరీష్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, నవీన్, రవీందర్ రెడ్డి, మహేందర్, రాజు తదితరులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మౌలిక వసతులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలి....

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్.( ది క్రైమ్ న్యూస్) మే18:** మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ హాజరయ్యారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఇఇఅఇ పాల్గొన్న ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, రహదారుల విస్తరణ, జీవో 59 క్రమబద్ధీకరణ, జిహెచ్ఎంసిలో విలీనమైన శివారు ప్రాంతాల తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జీవో 59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్లను క్రమబద్ధీకరించాలని కోరారు. జిహెచ్ఎంసిలో విలీనమైన ఔటర్ రింగ్ రోడ్ వెలుపలి ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఆర్డబ్ల్యూఎస్ --హెచ్ఎండబ్ల్యూఎస్ శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా మియాపూర్--బౌరంపేట్, బహదూర్‌పల్లి--కొంపల్లి రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, జిహెచ్ఎంసి పరిధిలో రహదారుల అభివృద్ధితో పాటు భూగర్భ డ్రైనేజీ సమస్యలను కూడా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## కరీంనగర్‌లో వైభవంగా ప్రారంభమైన 'టైటానిక్ ఎగ్జిబిషన్'







**కరీంనగర్ టౌన్, మే 18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ లోని పద్మనగర్ మైదానంలో సరికొత్త హంగులతో ఏర్పాటు చేసిన 'టైటానిక్ ఎగ్జిబిషన్' వైభవంగా ప్రారంభమైంది. ఈ ప్రదర్శనకు సంబంధించిన వివరాలను ఎగ్జిబిషన్ నిర్వాహకులు మహమ్మద్ జాఫర్, మల్లికార్జున్, విజయ్ కుమార్, జాన్ బాబు సంయుక్తంగా వెల్లడించారు. ప్రసిద్ధ టైటానిక్ నౌక విశేషాలను, అందులోని ప్రధాన నటీనటుల (యాక్టర్స్) రూపాలను కళ్లకు కట్టేలా ఈ ఎగ్జిబిషన్‌లో తీర్చిదిద్దామని వారు పేర్కొన్నారు. కరీంనగర్ ప్రజలకు సరికొత్త అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే దీనిని ఇక్కడకు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో కేవలం టైటానిక్ నౌక నమూనా మాత్రమే కాకుండా, చిన్నారులను ఆకట్టుకునే రకరకాల ఆట వస్తువులు, రైడ్‌లు మహిళలకు కావలసిన గృహోపకరణాలు, ఫ్యాషన్ ఐటమ్స్, వివిధ రకాల స్టాళ్లను అందుబాటులో ఉంచామని యాజమాన్యం వివరించింది. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ ప్రదర్శనను సందర్శించి, విజయవంతం చేయాలని కరీంనగర్ ప్రజలను వారు కోరారు.

## ఈ గింజలను ఇలా తింటే పొట్ట తగ్గడం ఖాయం..!

బరువు తగ్గడానికి చియా గింజల నీరు: బరువు తగ్గడానికి చియా గింజల నీటిని తీసుకోవచ్చు. దీని కోసం ఒక టేబుల్ స్పూన్ చియా గింజలను ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. ఉదయాన్నే పరగడుపున దీన్ని సేవించండి. ఈ నీటిని రోజూ తీసుకోవడం వల్ల చాలా వరకు బరువు తగ్గవచ్చు. బరువు తగ్గడానికి చియా సీడ్స్ స్మూతీ: బరువు తగ్గడానికి చియా విత్తనాలను స్మూతీస్‌లో ఉపయోగించవచ్చు. దీని కోసం మీకు ఇష్టమైన పండ్లు, పెరుగును వేసి కలపాలి. తర్వాత ఒక చెంచా నానబెట్టిన చియా గింజలను వేసి అన్ని మిక్స్ చేయండి. దీన్ని అల్పాహారంగా తీసుకోవచ్చు. సలాడ్‌లో చియా విత్తనాలను ఉపయోగించండి : బరువు తగ్గడానికి, చియా గింజలను సలాడ్‌లో కలిపి తినవచ్చు. ఇది మీ కడుపుని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. దీని కోసం, మీరు సలాడ్లో 1-2 స్పూన్ల చియా విత్తనాలను తినవచ్చు. కావాలనుకుంటే నిమ్మరసం, నల్ల మిరియాలు కూడా చల్లుకోవచ్చు. బరువు తగ్గడానికి చియా సీడ్స్ పుడ్డింగ్: బరువు తగ్గడానికి చియా సీడ్స్ పుడ్డింగ్ ఒక ఆరోగ్యకరమైన ఎంపిక. దీన్ని సిద్ధం చేయడానికి, ఒక టేబుల్ స్పూన్ చియా గింజలను రాత్రంతా పాలలో నానబెట్టండి. ఇందులో పండ్లు, డ్రై ఫ్రూట్స్, నట్స్ వేసి ఉదయాన్నే తీసుకుంటే తినడానికి రుచికరంగా ఉంటుంది మరియు బరువు కూడా తగ్గుతుంది. ఓట్స్, చియా విత్తనాలు: మీరు అల్పాహారంగా ఓట్స్ తింటే, మీరు చియా విత్తనాలను కూడా అందులో కలుపుకోవచ్చు. ఓట్స్‌లో చియా గింజలను వేసుకోవటం వల్ల మీ అల్పాహారం మరింత పోషకమైనదిగా మారుతుంది. ఇదిశరీరంలోని అదనపు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన పడాల పద్మ రెండవ కూతురు కళ్యాణ లక్ష్మి దరఖాస్తు తీసుకునేందుకు ఆధార్ నెంబర్ తీసుకోవడం లేదని దీనికి సంబంధించి సవరణ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మీసేవ రెవెన్యూ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. శ్రీరాంపూర్ మండలం భీమారంపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల రమ్య తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ అధికారికి రాస్తూ అర్హత పరిశీలించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముత్తారం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ తమ గ్రామంలోని సర్వే నెంబర్ 107/బి/2/2 లో మూడు ఎకరాల విస్తీర్ణం భూమి ఉందని ఇక్కడ కాల్వ లేకున్నా ఉన్నట్లు చూపుతూ 47 గుంటల భూమి మా పేరు నుంచి తొలగించారని దీని సవరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా కలెక్టరేట్ డీ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల్లోనే గురుకులాల్లో మరమ్మత్తులు చేపట్టాలి : బీజేపీ నేతల డిమాండ్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇతర మరమ్మత్తులను విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని రామగుండం బీజేపీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి అధికారులను కోరారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టరుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని అనేక గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా బాలికలు పరిశుభ్రత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న ఆమె, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని గురుకులాల్లో మరుగుదొడ్ల మరమ్మత్తులు చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని సంధ్యారాణి స్పష్టం చేసారు. దేశప్రధాని నరేంద్రమోది సూచనల మేరకు ఇంధన వినియోగాన్ని తగ్గించి ప్రభుత్వ రవాణా వ్యవస్థను ప్రోత్సహించే ఉద్దేశంతో బీజేపీ నాయకులు టీఎస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ గౌడ్, బోడకుంట సుభాష్, ఊరగొండ అపర్ణ, పాకాల నరసింహారెడ్డి, కోడూరి రమేష్, ఏరుకొండ తిరుపతి, కొమిరే లక్ష్మణ్, మీస వికాస్, శిలారపు కళ్యాణ్, గన్న శ్రీనివాస్, కొట్టే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి



**రామగిరి,మే 18(ది క్రైమ్ న్యూస్):** ఇటీవలే తాటి చెట్టు పై నుండి పడి గాయాలపాయలైన మల్యాల రాయ మల్లు కు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించాలని గౌడ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. నాగారం గ్రామ పంచాయతీ లోని లింగాల గ్రామానికి చెందిన మల్యాల రాయమల్లు గౌడ్ అనే గీత కార్మికుడు శనివారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా తన కత్తి అదుపు తప్పి చెయ్యిపై పడటంతో కత్తి తన చెయ్యికి లోతుగా దిగడం తో తాటి చెట్టు పైనుండి కిందకు పడటం జరిగింది. అందుబాటులో ఉన్న తోటి కుమార్ గౌడ్,కమ్మగోని భాస్కర్ లు స్పందించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో చేర్చడం జరిగింది. అనంతరం ఇంటికి చేరుకున్న రాయమల్లును పలువురు గీత కార్మికులు సోమవారం పరామర్శించి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

## చందానగర్‌లో ఆర్కిటెక్చర్ కార్యాలయ ప్రారంభం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన రెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "డీటైల్డ్ ఇంచ్ ఆర్కిటెక్చర్" కార్యాలయాన్ని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డిలతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం యువతకు ఉపాధి అవకాశాలు పెరగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. చందానగర్ ప్రాంతం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, కొత్త సంస్థలు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ సంస్థ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రిపగడ సత్యనారాయణ, ఓ. వెంకటేష్, రామ రాజు, ప్రభాకర్ రెడ్డి, నగేష్, సురేష్ నాయక్, నరేందర్ బల్లా, రమణ రెడ్డి, రాజేందర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వజి



## ఉపవాసం ఇలా చేస్తే ఎన్నో ప్రయోజనాలు - ఈ పొరపాట్లు చేయద్దు..!!

ఉపవాసం గొప్ప ఔషధం. శరీరంలో నిత్యం పోరాటం చేసే అవయవాల పై ఒత్తిడి తగ్గించి ఆరోగ్యం అందిస్తుంది. ఆధ్మాత్మికంగా ఉపవాసం వారంలో ఏదో ఒక రోజు పాటిస్తూ ఉంటారు. అయితే, ఇది సైన్స్ పరంగానూ ఆరోగ్యానికి ఎంతో మంచిది అని నిరూపితం అయింది. అదే సమయంలో ఉపవాసం పేరుతో కొందరు ఎన్నో మినహాయింపులు ఇచ్చేస్తారు. ఖచ్చితమైన నిపుణుల సూచన ల మేరకు ఉపవాసం ఉంటే ఆరోగ్య పరంగా ప్రయోజనాలు అందుతాయి. అదే సమయంలో కొందరికి ఈ ఉపవాసం మంచిది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఉపవాసంలో ఎన్నో ఆరోగ్య రహస్యాలు ఉన్నాయి. వారంలో ఒక రోజు ఉపవాసం ఉండటం ద్వారా అద్భుతమైన లాభాలు ఉన్నాయి. ఇది సైన్స్ పరంగానూ నిరూపితం అయింది. ఉపవాసం కనీసం 12 గంటలు ఉండాలి. దీని కారణంగా కొవ్వు కరిగే ప్రక్రియ పెరుగుతుంది. ముఖ్యంగా పొట్ట, తొడల దగ్గర ఉండే కొవ్వు కరుగటానికి అవకాశం ఏర్పడుతుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఏదైనా ఒక రోజు వారంలో ఉపవాసం చేస్తే ఆకలి హార్మోన్లు నియంత్రణలోకి వస్తాయని నిపుణులు చెబుతున్నారు. కాగా, ఉపవాసం కారణంగా క్లోమ గ్రంధి పైన ఒత్తిడి తగ్గి.. శరీరం ఇన్సులిన్‌ను సమర్ధవం తంగా ఉపయోగించుకుంటుంది. షుగర్ లెవల్స్ నియంత్రణలోకి వస్తాయి. అయితే డయాబెటిస్ ఉన్నవారు ఫాస్టింగ్ చేసే సమయంలో మందులను వాడకూడదు. లేదంటే షుగర్ లెవల్స్ మరీ అధికంగా పడిపోతే మరింత సమస్యగా మారుతుంది. ఉపవాసం వలన మంచి కొలెస్ట్రాల్ పెరగ టం తో పాటుగా.. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని ద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. వారంలో ఒక రోజు ఉపవాసం ఉంటే శరీరం తనకు తాను అవసరమైన మార్పులు చేసుకొనే వెసులుబాటు కలుగుతుంది. అవయవాలు మళ్లీ పునరుత్తేజం చెంది యాక్టివ్‌గా మారుతాయి. మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. నీరసం, అలసట దూరం అవుతాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే గర్భంతో ఉన్న మహిళలు లేదా పాలిచ్చే తల్లులు ఉపవాసం ఉండడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టైప్ 2 డయాబెటిస్ ఉంటే డాక్టర్ సూచన మేరకు మాత్రమే ఉపవాసం చేయాలి.టైప్ 1 డయాబెటిస్ ఉన్నవారు ఉపవాసం చేయవద్దని నిపుణులు తేల్చి చెబుతున్నారు. కిడ్నీ, లివర్ వ్యాధులు ఉన్నవారు, గుండె జబ్బులు ఉన్నవారు, బీపీ మందులను తీసుకుంటున్నవారితో సహా పోషకాహార లోపం ఉన్నవారికి ఉపవాసం మంచిది కాదు. ఉపవాసం ఉన్న సమయంలో నీళ్లను అధికంగా తాగాలి. ఆకలికి తట్టుకోలేకపోతే తేనె, నిమ్మరసం కలిపిన నీళ్లను తాగుతుండాలి. లేదా కేవలం పండ్లను మాత్రమే తినాలి. ఇలా ఉపవాసం చేస్తే చక్కని ఫలితం ఉంటుంది.

# ఇది డిజిటల్ రామాయణం



దైనందిన జీవితంలో మంచి, చెడు తెలుసుకోవడానికి పురాణ కథలు ప్రేరణగా నిలుస్తాయి. రామాయణ, మహాభారతంలోని దృష్టాంతాలు ఉదహరిస్తే నీతి, నిజాయతీ పిల్లల బుర్రకెక్కుతాయని పెద్దలు ఆ కథలే చెబుతుండేవారు. ఇప్పుడు కథలు ఎక్కడివి? డిజిటల్ మానియాలో కొట్టుకుపోతున్నారంతా! కానీ, ఈ సాంకేతిక ప్రపంచంలో పాటించాల్సిన విధులు, తెలుసుకోవాల్సిన పరిమితులు, పొంచి ఉన్న ప్రమాదాల గురించి ఎన్ని హెచ్చరికలు జారీ అవుతున్నా.. పెడచెవిన పెడుతున్నారు. అందుకే ఈ ప్రయత్నం. రామాయణ పాత్రలతో డిజిటల్ అక్షరాస్యత పెంచుకుందాం.. రాముడుధర్మానికి ప్రతిరూపం. ఆయనలా నీతిగా, నిజాయతీగా ఉండాలంటే.. డిజిటల్ అట్రాక్షన్‌కు గురికాకూడదు. శూర్పణఖ అట్రాక్ట్ చేయడానికి వచ్చినా.. రాముడు విముఖత ప్రదర్శించాడు! రాముడు ఫేక్‌న్యూస్ నమ్మేవాడు కాదు. వనవాసం తొలినాళ్లలో భరతుడు దండెత్తడానికి వస్తున్నాడని లక్ష్మణుడు చెప్పినా.. రాముడు గుడ్డిగా నమ్మలేదు. భరతుడు వచ్చింది తనను తీసుకెళ్లడానికే అని నిజం తర్వాత తేటతెల్లమైంది. రాముడు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడు. ఆచితూచి స్పందిస్తాడు. డిజిటల్ భాషలో చెప్పాలంటే రామయ్య ఎథికల్ డిజిటల్ సిటిజన్ అన్నమాట! సోషల్ మీడియా దునియాలో మనం అలా ఉండాలంటే.. నిజ జీవితంలో శ్రీరాముడు పాటించిన విధానాలు ఫాలో అవ్వడమే! హేట్ స్పీచ్ చేయొద్దు, ఫేక్ న్యూస్ నమ్మొద్దు. డేటా భద్రం... సీతమ్మ తల్లే రామచంద్రుడి ప్రాణం! మాయా బంగారు లేడిని పట్టుకునేందుకు రాముడు వెళ్లగానే.. సీతమ్మ భద్రత గాల్లో దీపంగా మారింది. ఇదే అదునుగా రావణుడు ఆ తల్లిని అపహరించాడు. మళ్లీ సీతమ్మను పొందడానికి రామచంద్రుడు యుద్ధమే చేయాల్సి వచ్చింది! ఈ దృష్టాంతాన్ని నేటి డిజిటల్ యుగానికి అన్వయించుకుంటే.. మన డేటా ప్రైవసీ సేఫ్టీ ఎంత ముఖ్యమో తెలుస్తుంది. కాస్త ఏమరుపాటుగా ఉన్నా.. మన డేటా సైబర్ రావణుల చేతికి చిక్కడం ఖాయం. ఫొటోలు, లొకేషన్, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికైనా సులభంగా అందుబాటులో ఉంచితే అది ఓ డిజిటల్ లంకకు మార్గం వేసినట్లే. సోషల్ మీడియాలో 'ఓవర్ షేరింగ్' చేస్తే సైబర్ స్టాకింగ్‌కు దారితీస్తుంది. 'నేను ఇప్పుడు వెకేషన్‌లో ఉన్నాను' అని లొకేషన్ ట్యాగ్‌తో పోస్ట్ చేస్తే, దొంగ రావణులకు మీ ఇల్లు ఖాళీగా ఉందని తెలిసిపోతుంది. ఇంకేముందీ.. మీ ఇల్లు గుల్ల చేస్తారు. సో.. మీ డేటా లేదా డబ్బు చోరీకి గురికాకుండా.. ప్రైవసీ మెయింటేన్ చేయండి. మన డేటాని రక్షించేందుకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ వాడాలి. పారాహుషార్.. రావణాసురుడు మాయావి, మోసం చేయడంలో నిపుణుడు. ఈ ఆన్‌లైన్ లోకంలో సైబర్ రావణులు ఎవరంటే స్కామర్స్, హ్యాకర్స్! ఫిషింగ్ మెయిల్స్, సోషల్ ఇంజనీరింగ్, ఆన్‌లైన్ గ్రూమింగ్.. ఇవన్నీ రావణుడి ట్రిక్స్ లాంటివే. అందుకే, ఆన్‌లైన్‌లో ఎవరిని పడితే వారిని గుడ్డిగా నమ్మేయకండి. లింక్స్ క్లిక్ చేసేటప్పుడు, మెయిల్స్ ఓపెన్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. రావణుడి మాయలో పడకుండా చూసుకోండి! ఫిషింగ్ లింక్స్, ఇ-మెయిల్స్‌ని గుర్తించండి. ఉదాహరణకు, మీరు లాటరీ గెలిచారు, ఈ లింక్ క్లిక్ చేయండి అని వచ్చే మెసేజ్‌లు రావణుడి మాయలే. ఇలాంటి లింక్స్ క్లిక్ చేస్తే మీ డేటా గోవిందా! అనుమానాస్పద ఇ-మెయిల్స్‌ని ఓపెన్ చేయకండి!

ప్రైవసీ సేఫ్టీ లైన్.. లక్ష్మణుడు సీతమ్మను రక్షించేందుకు గీసిన రేఖ గుర్తుందా? ఇది ఆన్‌లైన్‌లో మన ప్రైవసీ సెట్టింగ్స్ సేఫ్టీ లైన్ అన్నమాట. రావణుడు లాంటి సైబర్ క్రిమినల్స్ లోపలికి రాకుండా రక్షణ వలయంలా పని చేస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే.. లక్ష్మణుడు గీసిన గీత మన డిజిటల్ ప్రైవసీ సెట్టింగ్స్‌ను గుర్తుచేస్తుంది. ఎవరికైనా మన అకౌంట్‌లకు యాక్సెస్ ఇవ్వడమంటే ఆ రేఖ దాటి రావడం లాంటిది. ప్రతి యాప్‌లో ప్రైవసీ సెట్టింగ్స్ అప్‌డేట్ చేసుకోవాలి. 'ఒకసారి క్లిక్ చేస్తే ఏమవుతుంది?' అనే నిర్లక్ష్యం మన డేటా భద్రతను చంపేస్తుంది. సోషల్ మీడియాలో ఎవరైనా అసభ్యకరమైన కామెంట్స్ చేస్తే, ఫేక్ అకౌంట్స్ నుంచి స్కామ్ మెసేజ్‌లు వస్తే వెంటనే రిపోర్ట్ చేయాలి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో రిపోర్ట్ ఆప్షన్ వాడాలి. రామాయణంలో విభీషణుడిలా ధర్మానికి కొమ్ముకాస్తే, ఆన్‌లైన్ కమ్యూనిటీ సేఫ్‌గా ఉంటుంది.

లంక.. ఓ డార్క్ వెబ్... రావణుడి లంక ఆన్‌లైన్ లోకంలో డార్క్ వెబ్‌కి సింబల్. డార్క్ వెబ్ అంటే ఇంటర్నెట్‌లోని అన్‌సేఫ్, ఇల్లీగల్ కార్నర్స్ అన్నీ అక్కడే ఉంటాయి. ఇవి లంకంత ప్రమాదకరమైనవి. హ్యాకింగ్ టూల్స్, చైల్డ్ పోర్నోగ్రఫీ, అక్రమ లావాదేవీలు అన్నీ ఇక్కడే చోటు చేసుకుంటాయి. వాటికి దూరంగా ఉండటమే మన డిజిటల్ భద్రతకు మంచిది. ఇల్లీగల్ కంటెంట్ యాక్సెస్ చేసి లంకలో ప్రవేశిస్తే.. ఆ డార్క్ వెబ్‌లో మీ డేటా, డివైజ్ రిస్క్‌లో పడొచ్చు.

# ఈ ఒక్క పానీయంతో మీకు సూపర్ ఆరోగ్యం!



మన శరీరాన్ని చల్లబరిచి, మనకు ఆరోగ్యాన్ని ఇచ్చే పానీయాలలో మజ్జిగ ఒకటి. మజ్జిగ ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తుంది. మజ్జిగ మన శరీరంలో నిర్జలీకరణ ని నివారిస్తుంది. ప్రతిరోజు మజ్జిగ తాగడం వల్ల మన శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. మజ్జిగలో ఉండే ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా మరియు లాక్టిక్ ఆమ్లం జీర్ణక్రియకు ఎంతగానో దోహదం చేస్తాయి.

**మజ్జిగతో ఆరోగ్య ప్రయోజనాలు**

మజ్జిగ మన జీవక్రియను పెంచుతాయి. క్రమం తప్పకుండా పేగు కదలికలకు ప్రోత్సాహాన్ని ఇస్తాయి. మజ్జిగ మలబద్ధకాన్ని, కడుపులో తిప్పడం వంటి లక్షణాలను బాగా తగ్గిస్తుంది. మజ్జిగలో క్యాలరీలు మరియు కొవ్వు తక్కువగా ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునే వారు మజ్జిగను ఒక మంచి ఎంపికగా చేసుకోవచ్చు. మన బరువును నియంత్రించడానికి కూడా మంచిగా ఎంతో బాగా ఉపయోగపడుతుంది.

**మజ్జిగతో డీ హైడ్రేషన్ కు చెక్**

మజ్జిగలో నీరు మరియు పొటాషియం అంటే ఎలక్ట్రోలైట్ లు ఉండడం వల్ల ఇవి శరీరంలోని నీటి సమతుల్యతను కాపాడటానికి దోహదం చేస్తాయి. ఫలితంగా శరీరం డీహైడ్రేషన్ కాకుండా మజ్జిగ కాపాడుతుంది. మజ్జిగలో రిబోఫ్లేవిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఇది ఇందులో ఉండే అమైనో ఆమ్లాలను నియంత్రిస్తుంది. మజ్జిగ రోజంతా మనల్ని చురుగ్గా ఉండేలా చేస్తుంది.

**మజ్జిగతో కాలేయ ఆరోగ్యం**

మజ్జిగలో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఇది రక్తపోటును నియంత్రించడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. మజ్జిగ క్యాల్షియం మరియు విటమిన్ డి లకు మంచి మూలం కావడంతో ఎముకలకు మంచి బలాన్ని ఇస్తుంది. మజ్జిగ కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కాలేయం యొక్క మరమ్మతుకు పునరుత్పత్తికి మజ్జిగ సహాయపడుతుంది. మజ్జిగలోని ప్రోబయోటిక్స్ శరీరంలోని హానికరమైన కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడతాయి.

**మజ్జిగతో పేగు ఆరోగ్యం, చర్మ ఆరోగ్యం**

మజ్జిగ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కడుపులో మంటను తగ్గించి గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మజ్జిగ ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహిస్తుంది. మజ్జిగ వేడి వాతావరణంలో శరీరాన్ని రిఫ్రెష్ చేయడమే కాకుండా శరీరాన్ని చల్లబరిచి ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

# మార్కెట్

## దేశంలో 30కోట్ల 5జీ కస్టమర్లు


### స్మార్ట్‌ఫోన్లలో రోజుకు 1జీబీకిపైగానే డాటా వినియోగం

### ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్ట్‌లో వెల్లడి

న్యూఢిల్లీ : గత ఏడాది చివరి నాటికి దేశంలో 5జీ వినియోగదారులు 29 కోట్లకు చేరారని మంగళవారం విడుదలైన ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్టులో తేలింది. మొత్తం భారతీయ మొబైల్ వినియోగదారుల్లో ఇది 24 శాతమని పేర్కొన్నది. అలాగే ఒక్కో స్మార్ట్‌ఫోన్ యూజర్ నెలకు 32 జీబీ డాటాను వాడుకున్నారని ఈ తాజా నివేదికలో ఎరిక్సన్ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే 2030కల్లా ఇంచుమించుగా మూడురెట్లు పెరిగి దేశీయ 5జీ సబ్‌స్క్రైబర్లు దాదాపు 98 కోట్లకు చేరుకోవచ్చని (దేశీయ మొబైల్ వాడకందారుల్లో 75 శాతం), నెలకు స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల డాటా వాడకం 62 జీబీని తాకవచ్చని అంచనా వేసింది. ఇక 2030 నాటికి దేశంలో 4జీ కస్టమర్లు ప్రస్తుతంతో పోల్చితే సుమారు 60 శాతం పడిపోయి 23 కోట్లకు పరిమితం కావచ్చంటూ ఈ అప్‌డేటెడ్ రిపోర్టులో స్వీడిష్ టెలికం కంపెనీ చెప్పింది. నిరుడు నవంబర్‌లో విడుదల చేసిన రిపోర్టులో 2030 నాటికి దేశంలో 5జీ యూజర్లు 97 కోట్లకు పెరగవచ్చని, 4జీ కస్టమర్లు 24 కోట్లుగా ఉంటారని అంచనా వేసింది. నెలవారీ డాటా వినియోగం కూడా స్మార్ట్‌ఫోన్‌కు 66 జీబీగా ఉండొచ్చన్నది. అయితే తాజా నివేదికలో ఈ నెంబర్లను సవరించింది.




## మరోసారి లేఆఫ్స్‌కు సిద్ధమైన మైక్రోసాఫ్ట్.. !




ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు వందల మంది ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130కిపైగా కంపెనీలు దాదాపు 61 వేల మందికి పైగా ద్యోగులను తొలగించాయి. ఇక ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సంస్థ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా వేలాది మందిపై వేటు వేయనున్నట్లు తెలిపింది. వచ్చే వారం ప్రారంభంలో లేఆఫ్స్ గురించి సంస్థ ప్రకటించే అవకాశం ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. వేలాది మందిపై ఈ ప్రభావం ఉండనున్నట్లు సమాచారం. తాజా లేఆఫ్స్‌లు %శఎశీఇ% విభాగంలో (%శఎశీఇ ఒఅఐఅంఅశీఅ%) ఉండనున్నట్లు సమాచారం. గత 18 నెలల కాలంలో మైక్రోసాఫ్ట్ చేపట్టనున్న నాలుగో అతిపెద్ద ఉద్యోగాల కోత ఇదే కావొచ్చని టెక్ వర్గాలు భావిస్తున్నాయి. వరుస లేఆఫ్స్‌తో సంస్థలోని ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. ఈనెల ఆరంభంలో కూడా పలువురిపై సంస్థ వేటు వేసింది. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూన్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

## సాఫ్రాన్ ఫైటర్ జెట్ సెంటర్

హైదరాబాద్ : ఫ్రెంచ్‌కు చెందిన విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సాఫ్రాన్ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో వందేండ్లకుపైగా చరిత్ర ఉన్న సాఫ్రాన్.. హైదరాబాద్‌లో ఇప్పటికే రెండు ప్రపంచస్థాయి ఉత్పాదక కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాజాగా మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో సాఫ్రాన్ జనరల్ మేనేజర్ పియరీ ఫెర్నాండెజ్ కొత్త పెట్టుబడులను ప్రతిపాదించారు. నూతనంగా ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్టు ఆయన ప్రకటించారు. రఫేల్, ఎం 88 ఫైటర్ జెట్ ఇంజిన్ల నిర్వహణ, ఓవర్ హాలింగ్ పనులు ఇక్కడే నిర్వహించడానికి వీలు పడనున్నదన్నారు. తద్వారా వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా 150 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని, అనంతరం దశలవారీగా మరో 750 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం రఫేల్ యుద్ధ విమానాల ఇంజిన్లకు కీలక విడిభాగాలను తయారు చేస్తున్న సాఫ్రాన్ .. ఇకడి నుంచే ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నది కూడా. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ఫ్రెంచ్ కంపెనీలను ప్రోత్సహించాలని ఇఫీ ప్రతినిధులను కోరారు. అందిస్తున్న ప్రోత్సాహ కాలను ఆయన వివరించారు. 'తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలనే దూరదృష్టితోనే సీఎం రేవంత్ రెడ్డి 30 వేల ఎకరాల్లో పీపీపీ విధానంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారని, అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఈ నగరాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ సంకల్పమన్నారు.

# ఆంధ్రప్రదేశ్

## తిరుమలలో పెరిగిన అటవీ విస్తీర్ణం

### టిటిడికి సిఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి,మే18 : తిరుమలలో 89.4 శాతం అటవీ విస్తీర్ణం సాధించిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. శేషాచలం అడవుల్లో స్థానిక జాతుల పునరుద్ధరణకు టీటీడీ కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. అటవీ సంపద పరిరక్షణకు చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయమని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ దైవసేవతో సమానమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన తిరుమల అందించాలనే లక్ష్యంతో టీటీడీ చర్యలు చేపట్టిందని తెలిపారు. తిరుమల పర్యావరణ పరిరక్షణలో టీటీడీ చేస్తున్న కృషి అమోఘమని ప్రశంసించారు. శేషాచలం అటవీ సంపద కాపాడటంలో టీటీడీ నిరంతర చర్యలు కొనసాగాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## మరో ఫైనాన్స్ మోసం బట్టబయలు

### రాకెట్ ల్యబాబ్ పేరుతో ప్రజలకు బురిడీ

### కేసు నమోదు చేసిన పోలీసులు

పల్నాడు,మే18 : పల్నాడు జిల్లాలో రాకెట్ ల్యాబ్ పేరుతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెడితే భవిష్యత్తులో విడతల వారీగా రూ.25 కోట్ల వరకు వస్తాయని నమ్మబలికి వందలాది మంది నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో ఈ మోసం పెద్ద ఎత్తున జరిగింది. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూ.3వేల నుంచి రూ.11 వేలు కడితే విడతల వారీగా రూ.25 కోట్లు వస్తాయని కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. అత్యాశకుపోయి డబ్బులు కట్టి పలువురు బాధితులు మోసపోయారు. నరసరావుపేటలో 263 మంది సహా చిలకలూరిపేట మరికొందరు.. ఇలా మొత్తం సుమారు 500 మంది నుంచి కేటుగాళ్లు డబ్బులు వసూలు చేశారు. ప్రధాన నిందితుడు చిలకలూరిపేట మండలం గొట్టిపాడుకి చెందిన వెంకట్రావుతో సహా ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసానుపల్లి వీఆర్వో ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిందితులపై కేసు నమోదైంది. నాగండ్ల వెంకట్రావు, అతని కుమారుడు వంశీ, భార్య, పీఏ నీరజలపై కూడా కేసు నమోదైంది. వీరు పలు ప్రాంతాల్లో కార్యాలయాలు ఓపెన్ చేసి మరీ దందా కొనసాగించినట్లు పోలీసులు తెలిపారు. నరసరావుపేట, చిలకలూరిపేటలో నిందితులపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం

### ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపిన చంద్రబాబు

అమరావతి,మే18 : ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వీడన్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' ప్రదానం చేసింది. ఈ పురస్కారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ప్రధాని మోదీకి లభించిన ఈ గౌరవం భారతదేశానికి గర్వకారణమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్ఠను మరింత పెంచడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రభావాన్ని బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. స్వీడన్ ప్రభుత్వం అందించిన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' పురస్కారం ప్రధాని మోదీకి లభించిన 31వ అంతర్జాతీయ గౌరవమని ప్రస్తావించారు. ఇది వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా భారతదేశానికి లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా సీఎం అభివర్ణించారు.

## వేగవంతంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు

పోర్టులు, ఫిషింగ్ హర్బర్‌ల నిర్మాణంలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కరిస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల పనులు మరింత వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. మూలపేట పోర్టుకు సంబంధించి ప్రధానంగా ఉప్పు భూముల సమస్య, రోడ్డు, రైల్వే, ఆర్ అండ్ ఆర్ వంటి మౌలిక సదుపాయాల కల్పన సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. మూలపేట గ్రామానికి పునరావాస కల్పనను వేగవంతం చేయడం ద్వారా డ్రెడ్జింగ్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ఈ ఏడాది ఆఖరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. మచిలీపట్నం పోర్టుకు రైల్వే అనుసంధానం, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని దిశానిర్దేశర చేశారు. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను చేపట్టిన క్రమంలో వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు సహకరించాలని కోరారు. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో డ్రెడ్జింగ్, పునరావాసం వంటి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని మార్గనిర్దేశర చేశారు. మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులతో పాటు, ఫేజ్1 ఫిషింగ్ హర్బర్‌ల పనులు కూడా సకాలంలో పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు.

### బండి సంజయ్ రాజీనామా కోరుతూ ఆందోళన

రాజన్న సిరిసిల్ల,మే18 : సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్టయిన నేపథ్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలపై బీజేపీ శ్రేణులు దాడికి దిగాయి. ఈ ఘటనలో పలువురు బీఆర్ఎస్ నేతలు గాయపడ్డారు. బీజేపీ శ్రేణులు దాడికి పాల్పడినప్పటికీ బీఆర్ఎస్ నేతలు నిరసనలు ఆపలేదు. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ క్రమంలో ఉద్రిక్తతలు తలెత్తడంతో జిల్లా ఎస్పీ మహేశ్ బి గితే, డీఎస్పీ నాగేంద్రచారి బీజేపీ నేతలను అడ్డుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక బీఆర్ఎస్ నేతలను సముదాయించి పంపించారు.

# ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండండి

### జూన్ 1నుంచి కాలువల్లోకి నీరు విడుదల

### రైతులకు మంత్రులు అచ్చన్న, రామానాయుడు భరోసా




అమరావతి,మే18 : రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండాలని, జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగునీరు విడుదల చేస్తామని మంత్రులు ప్రకటించారు. ఖరీఫ్-2026 సాగునీటి విడుదలపై మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. కాలువల్లో పూడిక తొలగింపు పనులను మే చివరికి పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. గత సీజన్‌లో 2025-26 ఖరీఫ్‌లో 99.35 లక్షల ఎకరాలకు 888 టీఎంసీల నీటి సరఫరా చేశామని, రబీ సీజన్‌లో 23.67 లక్షల ఎకరాలకు 153 టీఎంసీల నీరు అందించామని మంత్రులు తెలిపారు. రాష్ట్ర రిజర్వాయర్లలో 461 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని వెల్లడించారు. గోదావరి డెల్టాకు జూన్ 1 నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు మంత్రులు ప్రకటించారు. కృష్ణా డెల్టాకు జూలై 1 నుంచి, నాగార్జున సాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కె.సి. కెనాల్‌కు జూలై 15 నుంచి, వంశధార ఆయకట్టుకు జూన్ 15 నుంచి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ఖరీఫ్-2026 ప్రణాళికలు, ఎల్ నినో ప్రభావంపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఎరువులు పక్కదారి పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. యూరియా సరఫరా కోసం రైతులకు ప్రత్యేక కార్డులు అందజేస్తామని, అవసరం మేరకు ఆ కార్డు ద్వారా యూరియా తీసుకోవచ్చని తెలిపారు. ముందస్తు నిల్వలు వద్దని, రెండు-మూడు దశల్లో నానో యూరియా వినియోగించాలని సూచించారు. యుద్ధం కారణంగా యూరియా దిగుమతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అందువల్ల యూరియాను అవసరం మేరకు మాత్రమే వాడాలని రైతులకు అచ్చెన్నాయుడు సూచించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి రైతాంగాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ పాలకులు ఇప్పుడు రైతులపై సానుభూతితో మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. రైతులకు సరైన సమయంలో విత్తనాలు, ఎరువులు అందక ఇబ్బంది పడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోయారు. రైతు భరోసా పేరుతో చెప్పినంత ఇవ్వకుండా మోసం చేశారని మంత్రి పేర్కొన్నారు. మామిడి రైతుల సమస్యలపై మాట్లాడే ముందు వైసీపీ హయాంలో ఉద్యాన రైతులు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకోవాలన్నారు. వైసీపీ పాలనలో మొక్కజొన్న రైతుల పరిస్థితి దారుణంగా లేదా? కనీస మద్దతు ధర అమలులో విఫలం కాలేదా? రైతులు రోడ్లపై ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకుందా? కేవలం ప్రచార రాజకీయాలు తప్ప.. రైతు సంక్షేమం పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు సంబంధించిన ప్రతి అంశంపైనా సమీక్ష చేస్తున్నాం. నిజంగా రైతుల కోసం పని చేయాలనే ఉద్దేశం వైసీపీ నేతలకు ఉంటే చౌకబారు విమర్శలు మానాలని హితవు పలికారు.

## ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర పరిష్కారం

### జైళ్లను సంస్కరించి ఆధునీకరిస్తున్నాం

### రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత

### కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనం

తిరుపతి : రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జైల్ సిబ్బంది, పోలీసులు వేరన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది వారికి దగ్గరగా ఉంటూ.. మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. జైల్ నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతామని చెప్పారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్లో హోంమంత్రి అనిత ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం సబ్ జైల్‌కు వెళ్లిన మంత్రి.. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు అని చెప్పుకొచ్చారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్ విస్తీర్ణం తక్కువగా ఉందని.. ఖైదీల సంఖ్య 120 ఉండాల్సింది.. 140 మంది ఉన్నట్లుగా తెలిసిందన్నారు. సబ్ జైల్ ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉన్నట్లు జైలు అధికారులు చెప్పారన్నారు. దీన్ని పెంచాలా.. లేక మరోచోట నిర్మాణం చేయాలా అనేది పరిశీలిస్తామని తెలిపారు. ఖైదీల భద్రత తమ బాధ్యత అని.. ఖైదీల్లో కూడా పరివర్తన రావాలని హోంమంత్రి అన్నారు. రాజాబ్ క్యాలెండర్ ద్వారా పోలీసు, ఫైర్, జైల్ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. అంతుకుముందు తిరుమల శ్రీవారిని అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు స్వాగతం పలికిన టిటిడి అధికారులు దర్శనం చేయించి, శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. వేదాశీర్వచనం చేశారు.

## బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీ

### సిఎం చంద్రబాబుతో ప్రతినిధుల భేటీ

అమరావతి,మే18 ): ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ భారీ పెట్టుబడితో తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ నేతృత్వంలోని బృందం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా బుల్లెట్ మోటార్ సైకిల్ మోడళ్లను సీఎం పరిశీలించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. బు÷-లలెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్‌కు ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి 18 నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోందని సీఎం పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ తయారీ యూనిట్‌లో అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన తయారీ ఎ÷-లాంట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగానికి కొత్త ఊపు రానుందని భావిస్తున్నారు. ఈ ఎ÷-లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 9 లక్షల మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ త్వరలో 'ఫ్లైయింగ్ ప్లీ అ6' పేరుతో ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్‌ను కూడా మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కూడా ఏపీ కీలక కేంద్రంగా మారే అవకాశం ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు.

## నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో అత్యధికంగా 44.3 డిగ్రీలు

### ఎపిలో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు

### అప్రమత్తంగా ఉండాలని వాతావణ అధికారుల హెచ్చరిక

అమరావతి,మే18 : రాబోయే మూడు రోజుల పాటు కోస్తాంధ్ర జిల్లాల్లో ఎండ తీవ్రత మరింత పెరిగి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. పలు జిల్లాల్లో 45 నుంచి నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. సోమవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కడపలో 42.9నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుంచి - 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40- 42 ల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45- 47 ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. నెల్లూరు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44- 45ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 - 43ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45- 47ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42- 44ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. అలాగే రేపు 47 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 88 మండలాల్లో వడగాడ్పులు, ఎల్లుండి 177 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 255 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశంఉందని తెలిపారు. రేపు రాష్ట్రంలోని 47 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 88 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. బుధవారం పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని, 177 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 255 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రావద్దని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, పండ్లరసాలు తీసుకోవాలని సూచించారు. ఎండలో పని చేసే వారు తలకు రక్షణగా టోపీ ఉపయోగించాలని వైద్య నిపుణులు సూచించారు.

## ఇంధన పొదుపు అందిరి బాధ్యత

### సైకిల్‌పై గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

విజయవాడ,మే18 : పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు సీఎం చంద్రబాబు సూచనలతో తమ వాహనాలను పక్కన పెట్టి, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గిస్తూ కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే సైకిల్‌పై పర్యటించారు. కార్యకర్తలు, అనుచరులతో కలిసి నాగేశ్వరరావుపేట నుంచి ఎండపల్లి, అక్కడి నుంచి చిన్నపాండ్రాక, అనంతరం పాండ్రాక నుంచి నారాయణపురం వరకు సుమారు 50 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆదర్శంగా నిలిస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. సామాన్య ప్రజలు కూడా సాధ్యమైనంత వరకు సమీప ప్రయాణాలకు సైకిల్ లేదా నడకను అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల నేపథ్యంలో విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. ఆయన వెంట అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు.

## జంటహత్యల కేసులో సంచలన విషయాలు

### అప్పులు తీర్చనందుకే ఈ హత్యలు

### మరో ఆరుగురిని హత్య చేసేందుకు ప్లాన్

రంగారెడ్డి,మే18 : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుల విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమకు అప్పు ఇచ్చిన 8 మందినీ చంపేందుకు కరీమా బేగం దంపతులు, మరో వ్యక్తి పథక రచన చేశారు. పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగుచూశాయి. హత్యకు ప్లాన్ చేసిన 8 మంది మహిళల్లో ఇద్దరిని చంపగా.. మరో ఆరుగురిని కూడా అక్కడికి ఫాంహౌస్‌కు పిలిచారు. వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఇద్దరు మహిళల హత్య ఘటన వెలుగు చూసిన తర్వాత తమకూ ప్రాణహాని ఉందంటూ ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆబేదాబేగం, మహబూబాబీ.. అదే కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలారోజులు అవడంతో డబ్బులు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, నయీం పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. నిందితుల సమాచారంతో తాండూరు గ్రామీణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యాలాల ఎస్సై విఠల్‌రెడ్డి, బషీరాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ పోలీసు సిబ్బంది చేరుకొని తవ్వకాలు చేపట్టగా మహబూబాబీ అస్థిపంజరం బయటపడింది. తరువాత ఆబేదాబేగం మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం నిందితులను విచారించగా.. అప్పు ఇచ్చిన మరో ఆరుగురు మహిళలనూ చంపేందుకు ప్లాన్ చేసినట్లు షాకింగ్ విషయాన్ని వెల్లడించారు.

క్రైమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక





## టాక్సిక్ విడుదలలో మరింత జాప్యం

కారణాలను వెల్లడించిన హీరో యశ్

యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్'. దీని విడుదల కోసం అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల గురించి తాజాగా యశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని రిలీజ్ విషయంలో హాలీవుడ్ తరహా ప్రణాళికలు ఫాలో అవుతున్నట్లు చెప్పారు. అది ఇక్కడి వాళ్లకు నచ్చకపోవచ్చని కానీ, తాను ఏం చేసినా అభిమానుల కోసమేనని అన్నారు. ఓ హాలీవుడ్ మ్యాగజైన్ కవర్ ఫొటోకు పోజిలిచ్చిన యశ్.. దానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'టాక్సిక్' వాయిదాల గురించి మాట్లాడారు. ఆ సినిమా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కానుంది. మేం అన్ని ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని విడుదలను ప్లాన్ చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కోసం మేము తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలు, సాధారణంగా మన దేశంలో సినిమా విడుదల పద్ధతులకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ సినిమాను ప్రకటించినప్పటినుంచే ప్రమోషన్స్, మార్కెటింగ్ మొదలుపెడతారు. కానీ, 'టాక్సిక్' విషయంలో మేము హాలీవుడ్ విధానాన్ని అనుసరిస్తున్నాం. మొదట సినిమాను మొత్తం పూర్తి చేసి, ఆ తర్వాతే డిస్ట్రిబ్యూషన్ గురించి మాట్లాడుకుంటాం. ప్రస్తుతం నేను సినిమా విడుదల ప్రణాళికల పనుల్లోనే ఉన్నాను. ఈ పద్ధతి కచ్చితంగా అభిమానులకు నచ్చకపోవచ్చని అన్నారు.



## షారుఖ్ ఖాన్ తరువాత ఆ రికార్డు అల్లు అర్జున్‌దే






అభిమానుల ఎన్నో రోజుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ పుష్పరాజ్ అంటే ఫైర్ అనుకుంటివా.. వైల్డ్‌ఫైర్ అనుకుంటూ అల్లు అర్జున్ ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అదివారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ట్రైలర్ సెకండ్స్‌లోనే మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకొని యూట్యూబ్‌లో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతుంది. అయితే ఈ సినిమా ట్రైలర్ ఈవెంట్‌కు సంబంధించి ఉత్తరాదిలో అరుదైన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు అల్లు అర్జున్. ఈ సినిమా ట్రైలర్ వేడుకను బిహార్ రాజధాని పాట్నాలోని గాంధీ మైదాన్‌లో జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈ వేడుకతో అరుదైన రికార్డును నమోదు చేశాడు అల్లు అర్జున్. ఇప్పటివరకు ఉత్తరాదిలో ఏ నటుడికి రాని విధంగా.. ఒక హీరో సినిమా వేడుకకు 2 లక్షల మందికి పైగా హాజరు అయినట్లు తెలుస్తుంది. ఇంతకుముందు ఈ రికార్డు షారుఖ్ ఖాన్ పేరిటా నమోదు అయ్యింది. 2011లో షారుఖ్ నటించిన డాన్ 2 సినిమాకి పాట్నాలో ఇదే రేంజ్‌లో అభిమానులు రాగా.. ఇప్పుడు మళ్లీ అదే రేంజ్‌లో కనిపించడంతో ఇండియాకి కొత్త సూపర్ స్టార్ వచ్చాడని.. షారుఖ్ తర్వాత ఆ రేంజ్ ఉన్న హీరో అల్లు అర్జున్ మాత్రమేనని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు ముంబై పుష్ప 2 ప్రమోషన్స్‌లో భాగంగా షారుఖ్ ఖాన్ చీఫ్ గెస్ట్‌గా హాజరు కాబోతున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే.. ముంబై మొత్తం అట్టుడికి పోతుందని టాక్.

## ఆ సీక్వేల్‌కు నేను సూట్ కాదనిపించింది : నయనతార

నయనతార నటించిన 'ముక్తిఅమ్మన్' ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే! దర్శకుడిగా ఆర్జే బాలాజీకు మంచి గుర్తింపు దక్కింది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా 'ముక్తి అమ్మన్ 2' సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. సి.సుందర్ దర్శకుడు. అయితే ఈ సీక్వెల్‌కు ఆర్జే బాలాజీ దూరంగా ఉన్నారు. దీనిపై బాలాజీ స్పందించారు. సీక్వెల్‌పై తనకు ఏమాత్రం ఆసక్తి లేదని అన్నారు. "ముక్తి అమ్మన్' కథ నేనే రాశాను. నయనతారను కథానాయికగా తెరకెక్కించగా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు సీక్వెల్ తెరకెక్కించడంపై నాకు పెద్దగా ఆసక్తి లేదు. కాకపోతే నయన్ దగ్గర ఒక ఐడియా ఉంది. దానికి నేను సెట్ కాననిపించింది. ఈ క్రమంలోనే ఆమె వేరే దర్శకుడితో వర్క్ చేస్తున్నారు. అంతేకానీ క్రియేటివ్ విషయంలో మా మధ్య ఎలాంటి విభేధాలు లేవు. నన్ను ఈ పరిశ్రమకు పరిచయం చేసింది సుందర్. ఇప్పుడు ఆయన నా సినిమా సీక్వెల్ కోసం వర్క్ చేస్తున్నారు. అందుకు ఆనందంగా ఉంది. ఏం జరిగినా అది అంతా నా మంచికే అనుకుంటున్నా. సూర్య చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. ఇది నా అదృష్టం" అని అన్నారు. నయన్-ధనుష్ వివాదంపై స్పందించమని ఓ రిపోర్టర్ కోరగా "ఆ వివాదాన్ని నెటిజన్లు వినోదంగా చూస్తున్నారు. నయనతార చేసిన వ్యాఖ్యలపై ధనుష్ ఏమీ స్పందించలేదు. అలాంటప్పుడు నేను ఎలా కామెంట్ చేస్తాను. అది పూర్తిగా వాళ్ల వ్యక్తిగత విషయం. కాబట్టి వాళ్లనే పరిష్కరించుకోనిద్దాం" అని బదులిచ్చారు. ఆర్జే బాలాజీ కోలీవుడ్‌లో తెరకెక్కిన ఎన్నో చిత్రాల్లో హాస్య నటుడిగా కనిపించారు. 'స్పైడర్'తో తెలుగువారికి చేరువయ్యారు. 'ముక్తి అమ్మన్'తో మెగా ఫోన్ పట్టారు. తొలి ప్రయత్నంలోనే దర్శకుడిగా హిట్ అందుకున్నారు. ఈ చిత్రం తెలుగులో 'అమ్మోరు తల్లి'గా విడుదలైంది. ఆ తర్వాత 'వీట్ల విశేషం' అంటూ సత్యరాజ్‌తో ఓ మూవీ తీసి విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఆయన సూర్య 45 కోసం వర్క్ చేస్తున్నారు. త్వరలో చిత్రీకరణ మొదలవుతుంది.




## పెద్దికి సెన్సార్ క్లీయరెన్స్


### 3గంటల రన్ టైమ్ అంటూ ప్రచారం

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదల దిశగా మరో అడుగు ముందుకు వేసింది. చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి అధికారిక క్లియరెన్స్ లభించినట్లు సమాచారం. దీంతో పాటు ఈ సినిమాకు సంబంధించిన రన్‌టైమ్, సెన్సార్ టాక్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ప్రస్తుతం కమర్షియల్ చిత్రాలు రెండున్నర గంటల లోపే ఉండేలా దర్శకులు ప్లాన్ చేస్తున్నారు. అయితే 'పెద్ది' విషయంలో దర్శకుడు బుచ్చిబాబు కథపై పూర్తి నమ్మకంతో భారీ నిడివిని ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం దాదాపు 3 గంటల 9 నిమిషాల (189 నిమిషాలు) రన్‌టైమ్‌తో సెన్సార్ పూర్తి చేసుకుందని సమాచారం. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కెరీర్‌లో ఇంతటి సుదీర్ఘ నిడివితో వస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. సినిమాలోని భావోద్వేగాలు, యాక్షన్ ఎలిమెంట్స్, కథలోని తీవ్రత ప్రేక్షకులను మొత్తం ప్రయాణంలో కట్టిపడేస్తాయని చిత్ర బృందం ధీమాగా ఉంది. ఎక్కడా కథ నెమ్మదించకుండా స్క్రీన్‌ప్లేను బుచ్చిబాబు ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం 1980ల కాలం నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే జీవన విధానం, క్రీడా సంస్కృతి, మనుషుల మధ్య ఉన్న భావోద్వేగాలు, పంతాలు, పట్టింపులను కథలో ప్రధానాంశాలుగా తీసుకున్నట్లు సమాచారం. ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా కొత్త రస్టిక్ లుక్‌లో కనిపించనున్నారు. పాత్ర కోసం ఆయన తన శరీరాకృతిని కూడా ప్రత్యేకంగా మార్చుకున్నట్లు ఇప్పటికే విడుదలైన పోస్టర్లు స్పష్టం చేశాయి. ఈ లుక్‌కు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సెన్సార్ బృందం నుంచి కూడా సినిమాకు మంచి స్పందన వచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, బుచ్చిబాబు మేకింగ్, సినిమాలోని ఎమోషనల్ కంటెంట్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని టాక్ వినిపిస్తోంది. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా కథలోని భావోద్వేగాలు ప్రేక్షకులను కదిలించే స్థాయిలో ఉంటాయని కూడా సమాచారం.

## డేటింగ్‌లో శ్రీలీల, తిలక్‌వర్మ

### రూమర్స్‌ను ఖండించిన తల్లి స్వర్ణలత

నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు. కార్తిక్ ఆర్యన్ తల్లి, నేనూ ఇద్దరం గైనకాలజిస్టులం. మా వైద్య నేపథ్యం కారణంగా వృత్తిపరంగా కలుసుకుంటాము. దురదృష్టవశాత్తూ.. అందరూ శ్రీలీల, కార్తిక్‌లకు రిలేషన్ ఉందని రాయడం మొదలుపెట్టారని ఖండించారు.



## కాఫీకప్పులో తుఫాన్

### కురుప్పలో విజయ్ అంటూ..ప్రచారం

సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో ఆర్‌జే బాలాజీ తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' తెలుగులో వీరభద్రుడుగా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వైరల్ అవుతోంది. ఇందులో విజయ్ నటించారంటూ ఓ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ 'లియో' చిత్రానికి సంబంధించిన రిఫరెన్స్ ఉన్నట్లు నెటిజన్లు గుర్తిస్తున్నారు. 'కరుప్పు'లో వచ్చే ఒక సన్నివేశంలో ఎవరో కాఫీ పెడుతున్నట్లు చూపిస్తారు. అయితే ఆ కాఫీ పెడుతున్న వ్యక్తి మరెవరో కాదు.. 'లియో' సినిమాలోని పార్థిబన్ (విజయ్) క్యారెక్టరేనని ఊహించుకుంటున్నారు. పైగా ఈ సన్నివేశానికి ముందు కాఫీ షాప్‌లో సర్వర్.. 'నీకు స్పెషల్ లియో కాఫీ తెస్తాను' అనడం.. అక్కడ కాఫీ పెడుతోన్న వ్యక్తిని వెనక నుంచి మాత్రమే చూపించడంతో అందరూ విజయ్ అతిథి పాత్రలో నటించారా! అని మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. కాఫీ షాప్ సన్నివేశంలో కనిపించిన శాండీ, జననీ ఇద్దరూ విజయ్ 'లియో'లోనూ కాఫీషాప్ సీన్‌లో నటించారు. ఈ సన్నివేశంపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ పెడుతున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell :
7989575563, Mail:thecrimenews123@gmail.com

# ధోని ఫ్యాన్స్‌కు మరోసారి నిరాశ

స్పోర్ట్స్

ఐపీఎల్ 2026లో భాగంగా నేడు మరో హై వోల్టేట్ మ్యాచ్ జరుగుతోంది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సీఎస్కే తలపడుతోంది. ఇక టాస్ గెలిచిన చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే సీఎస్కే అభిమానులకు ఈసారి కూడా నిరాశే మిగిలింది. ఎంఎస్ ధోనీ ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని కెప్టెన్ రుతురాజ్ స్పష్టం చేశాడు. ధోనీ పూర్తి ఫిట్‌నెస్‌తో లేకపోవడం వల్లే ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని రుతురాజ్ తెలిపాడు. ఈ రోజు తాము గెలుస్తామని, తదుపరి మ్యాచ్‌కు ధోనీ కోలుకుని తిరిగి జట్టులోకి వస్తాడని ఆశిస్తున్నట్లు కెప్టెన్ పేర్కొన్నాడు. ఈ క్రమంలో ధోనీ టీ20 రిటైర్మెంట్?కు సంబంధించిన వీడియో వైరల్?గా మారింది. అయితే చెన్నై చేపాక్ వేదికగా జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో  మ్యాచ్?లో బరిలోకి దిగి సొంత అభిమానుల ముందు ధోనీ ఐపీఎల్?కు రిటైర్మెంట్ ఇచ్చేస్తాడని జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ధోనీ మాట్లాడిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. అందులో ధోనీ 'చెన్నైలోనే నా ఆఖరి టీ20 మ్యాచ్ ఉంటుంది' అని అన్నాడు. దీంతో అది నిజం కానుందని అంటున్నారు. 'పక్కా ప్లానింగ్?తోనే నా క్రికెట్ కెరీర్?ను ఉంటుంది. ఇంటర్నేషనల్ లెవెల్?లో నా చివరి మ్యాచ్ రాంచీలో ఆడాను. అలాగే ఆఖరి టీ20 మ్యాచ్?ను చెన్నైలోనే ఆడతాను కావొచ్చు. అది ఇప్పుడేనా లేదా ఐదేళ్ల



తర్వాతనా? అనేది చెప్పలేను!'అని ధోనీ 2021లో సీఎస్కే ఫ్రాంచైజీ నిర్వహించిన ఈవెంట్?లో అన్నాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతుంది. ఇదిలా ఉండగా, ధోనీకి సంబంధించిన ఒక కొత్త వీడియో సైతం నెట్టింట వైరల్?గా మారింది. అందులో ధోనీ ఎన్?ఎస్?జీ కమాండర్స్?తో మాట్లాడుతున్నట్లు కనిపిస్తుంది. ఫుడ్ ప్లేట్ చేతిలో పట్టుకొని ఉన్న ధోనీ అందులో 'నేను ఫిట్?గా కనిపిస్తున్నానా?' అని ఎన్?ఎస్?జీ కమాండర్?ను నవ్వుతూ అడుగుతాడు. దీంతో తాను ఫిట్?గానే ఉన్నానని ఇలా ఫ్యాన్స్?కు చెప్పాడని, రిటైర్మెంట్?లాంటివి ఏమీ లేవని హింట్ ఇచ్చాడంటూ ఫ్యాన్స్? వాదిస్తున్నారు. ? అయితే సన్?రైజర్స్?తో సోమవారం చెన్నై వేదికగానే మ్యాచ్ ఉంది. ఈ సీజన్?లో సీఎస్కేకు ఇదే హోం గ్రౌండ్?లో లాస్ట్ మ్యాచ్. దీంతో ధోనీ గతంలో చెప్పిన రిటైర్మెంట్ టైమ్ ఇప్పుడే వచ్చేసిందా? అంటే నెటిజన్లు ఔను అనే అంటున్నారు. ప్రస్తుతం 44ఏళ్లు ఉన్న ధోనీ వచ్చే సీజన్?దాకా ఫిట్?నెస్ కాపాడుకోగలడా? అనేది కచ్చితంగా చెప్పలేం. ఇక ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి కూడా సడెన్?గా వీడ్కోలు చెప్పి అందర్నీ షాక్?కు గురి చేసిన తలా ఇప్పుడు ఐపీఎల్ నుంచి కూడా తప్పుకొని మరోసారి అభిమానులకు షాక్ ఇస్తాడా? అనేది వేచి చూడాలి!



## మరో కొత్త టీం ఎంట్రీకి రంగం సిద్ధం..

పురుషుల ఐపీఎల్ టోర్నమెంట్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, అశేష అభిమాన గణాన్ని సంపాదించుకున్న చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పుడు మహిళల క్రికెట్ వైపు అడుగులు వేస్తోంది. తమిళనాడు గ్లోబల్ టూరిజం సదస్సులో సిఎస్‌కె ప్రధాన కార్యనిర్వాహక అధికారి  కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. పురుషుల క్రికెట్ తర్వాత ఫ్రాంచైజీ విస్తరణలో భాగంగా తాము మహిళల క్రికెట్‌కే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలోనే డబ్ల్యూపీఎల్‌లో ఒక జట్టును సొంతం చేసుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం మహిళల లీగ్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ వంటి ప్రముఖ ఐపీఎల్ జట్లు ఇప్పటికే తమ మహిళా జట్లను విజయవంతంగా నడుపుతున్నాయి. వీటికి తోడు యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ కూడా లీగ్‌లో భాగస్వాములుగా ఉన్నాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి చెన్నై సూపర్ కింగ్స్ కూడా చేరితే లీగ్ స్థాయి మరింత పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. చెన్నై జట్టుకు ఉన్న అపారమైన అభిమాన బలం (ఎల్లో ఆర్మీ) మహిళల లీగ్‌కు కూడా తోడైతే, మైదానాలు పసుపు రంగుతో కళకళలాడటం ఖాయం. మహిళల లీగ్‌లోకి ప్రవేశించడంపై కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. యాజమాన్యం ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోదని, అత్యంత సుస్థిరమైన, వ్యూహాత్మకమైన విధానంలోనే ముందుకు వెళ్తామని చెప్పారు. క్రీడారంగంలో దీర్ఘకాలిక ప్రణాళికలతో ఆటగాళ్లకు అండగా నిలబడటం చెన్నై సంస్కృతి. అదే పద్ధతిని మహిళల క్రికెట్‌లోనూ కొనసాగిస్తామని పేర్కొన్నారు. క్రికెట్‌తో పాటు తమిళనాడులో గ్రాస్‌రూట్ స్థాయిలో చెస్, కుస్తీ వంటి ఇతర క్రీడలను కూడా సిఎస్‌కె ప్రోత్సహిస్తోందని, అందులో భాగంగానే మహిళా క్రీడాకారులకు పెద్దపీట వేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి మహిళల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తోంది. ఈ తరుణంలో చెన్నై సూపర్ కింగ్స్ వంటి బలమైన యాజమాన్యం లీగ్‌లోకి రావడం వల్ల యువ మహిళా క్రికెటర్లకు మరిన్ని మెరుగైన అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారిణులను వెలికితీసి అంతర్జాతీయ స్థాయికి చేర్చడంలో సిఎస్‌కె మేనేజ్‌మెంట్ అనుభవం ఎంతగానో ఉపయోగపడనుంది. మహేంద్ర సింగ్ ధోనీ సారథ్యంలో ఐపీఎల్‌లో ఒక అద్భుతమైన సామ్రాజ్యాన్ని నిర్మించిన చెన్నై సూపర్ కింగ్స్, ఇప్పుడు మహిళల లీగ్‌లోనూ అదే విధమైన సంచలనాలు సృష్టించడానికి సిద్ధమవుతోంది. అధికారికంగా ఈ జట్టు ఎప్పుడు రంగంలోకి దిగుతుందనే దానిపై ఇంకా స్పష్టమైన తేదీ వెల్లడి కానప్పటికీ, ఈ ప్రకటనతోనే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. భవిష్యత్తులో మహిళల ఐపీఎల్ వేదికపై కూడా 'విజిల్ పోడు' నినాదం గట్టిగా వినపడటం ఖాయంగా కనిపిస్తోంది.

## మరో మూడు బెర్తుల కోసం పోటీ తీవ్రం

2026 ఐపీఎల్? ప్లేఆఫ్స్?లో మరో మూడు బెర్తుల కోసం పోటీ తీవ్రమైంది. ఆదివారం డబుల్ హెడర్ మ్యాచ్?ల తర్వాత ఆర్సీబీ ప్లేఆఫ్స్?కు దూసుకెళ్లింది. దీంతో మరో మూడు స్థానాల కోసం లీగ్?లో పోటీ పెరిగింది. తాజాగా రాజస్థాన్ రాయల్స్?ను ఓడించి దిల్లీ క్యాపిటల్స్? అవకాశాలు మెరుగుపర్చుకుంది. అటు హ్యాట్రిక్ ఓటములతో రాజస్థాన్ తమ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. రాజస్థాన్?పై నెగ్గిన దిల్లీ ప్రస్తుతానికి టెక్నికల్ పరంగా రేసులోనే ఉంది. దిల్లీ 12 పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టుకు లీగ్ స్టేజ్?లో మిగిలింది ఒకే ఒక్క మ్యాచ్ మాత్రమే. మే 24న కోల్?కతా నైట్?రైడర్స్?తో తలపడనుంది. ప్లేఆఫ్స్? రేసులో ఉండాలంటే దిల్లీ కచ్చితంగా ఈ మ్యాచ్?లో భారీ విజయం సాధించి తీరాల్సిందే! అప్పుడు ఆ జట్టు ఖాతాలో 14 పాయింట్లు ఉంటాయి. ఇక్కడి వరకు దిల్లీ ప్లేయర్ల చేతిలో పని. ఆ తర్వాత వాళ్ల చేతిలో ఏమీ లేదు. అదృష్టం కలిసొస్తే తప్పా దిల్లీని ప్లేఆఫ్స్?లో చూడలేము. మిగిలిన జట్ల ఫలితాలపైనే దిల్లీ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. అయితే గతంలో పలుమార్లు ఆయా జట్లు 14 పాయింట్లతో ప్లేఆఫ్స్?కు చేరుకున్నాయి. కానీ, ఈసారి పోటీ చూస్తుంటే మాత్రం అది దాదాపు అసాధ్యంగా కనిపిస్తుంది. దిల్లీ రన్?రేట్? కూడా మైనస్?లో ఉండడం మరో పెద్ద దెబ్బ! సన్?రైజర్స్, రాజస్థాన్, చెన్నై తమతమ తదుపరి మ్యాచ్?ల్లో ఓడితే దిల్లీకి ఛాన్స్ ఉంటుంది. అయితే ఇందులో సన్?రైజర్స్- చెన్నై ఓ మ్యాచ్?లో తలపడనున్నాయి. కచ్చితంగా ఈ మ్యాచ్?లో ఎవరో ఒకరు నెగ్గాల్సిందే. ఈ లెక్కన దిల్లీకి దాదాపు ఛాన్స్?లు లేనట్లే! ఈ సీజన్? ప్రారంభంలో వరుసగా నాలుగు విజయాలు సాధించిన రాజస్థాన్ ఈజీగా ప్లేఆఫ్స్?కు వెళ్తుందనిపించింది. కానీ సెకండ్ హాఫ్?లో ఆ జట్టు పరిస్థితి దారుణంగా తయారైంది. తొలి ఏడు మ్యాచ్?ల్లో 5 గెలిస్తే, తర్వాత ఆడిన ఐదు మ్యాచ్?ల్లో ఒకే విజయం నమోదు చేసింది. దీంతో ప్రస్తుతం ఆ జట్టు 12 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. అయినప్పటికీ రాజస్థాన్?కు ఇప్పటికీ ఛాన్స్? ఉంది. ఆ జట్టు ఇంకా రెండు మ్యాచ్?లు ఆడాల్సి ఉంది. అవీనూ లఖ్?నవూ (మే 19), ముంబయి ఇండియన్స్ (మే 24)ను ఢీ కొట్టాల్సి ఉంది. ఈ రెండింట్లోనూ నెగ్గితే 16 పాయింట్లతో ఉంటుంది. అప్పుడు రన్?రైట్ కీలకంగా మారుతుంది. అందుకే రాజస్థాన్ తమ ఆఖరి రెండు మ్యాచ్?ల్లో భారీ తేడాతో నెగ్గితేనే ముందడుగు వేస్తుంది! అయితే ఈ రెండింటిలో దిల్లీ కంటే రాజస్థాన్?కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇక మ్యాచ్ విషయానికొస్తే, రాజస్థాన్ నిర్దేశించిన 194 పరుగుల లక్ష్యాన్ని దిల్లీ క్యాపిటల్స్ 19.2 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (56 పరుగులు), అభిషేక్ పొరెల్ (51 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. అక్షర్ పటేల్ (34 పరుగులు) ఆకట్టుకున్నాడు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, బ్రిజేశ్ శర్మ చెరో 2, డాసున్ షనక 1 వికెట్ పడగొట్టారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 193 రన్స్ చేసింది. రియాన్ పరాగ్ (51 పరుగులు), ధ్రువ్ జురెల్ (53 పరుగులు) హాఫ్ సెంచరీలు చేశారు. వైభవ్ సూర్యవంశీ (46 పరుగులు) మెరిశాడు. దిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 4, లుంగి ఎంగ్డి, మాధవ్ తివారి చెరో 2 వికెట్లు పడగొట్టారు.



## ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ ఆశలు సజీవం

ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఢిల్లీ 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరింది. 5 వికెట్ల నష్టానికి 197 పరుగులు చేసి 4 బాల్స్ మిగిలి ఉండగానే ఛేజ్ చేసి గెలిచింది. ఈ విజయంతో ఢిల్లీ ప్లేఆఫ్ ఆశలు కొనసాగుతున్నాయి. రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో వైభవ్ సూర్యవంశి 21 బాల్స్‌లో 5 ఫోర్లు, 3 సిక్సులు కొట్టి 46 పరుగులు చేశాడు. కెప్టెన్ రియాన్ పరాగ్ 26 బాల్స్‌లో 3 ఫోర్లు, 5 సిక్సులతో 51 రన్స్ చేశాడు. ధ్రువ్ జురెల్ 40 బాల్స్‌లో 53 రన్స్ సాధించాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ లోని మిచెల్ స్టార్క్ 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి, 4 వికెట్లు తీసి రాజస్థాన్ మ్యాచ్‌ను తిప్పికొట్టాడు. అతను 14.2వ ఓవర్‌లో పరాగ్, 14.3లో డోనవన్ ఫెరీరా, 14.5లో రవి సింగ్ వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్‌లాంటి ప్రదర్శన చేశాడు. లుంగి ఎన్‌గిడి 2 వికెట్లు, మధవ్ తివారి 2 వికెట్లు సాధించారు. రాజస్థాన్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో ధమాల్ అంది. ఢిల్లీ ఛేజ్‌లో అభిషేక్ పోరెల్ 31 బాల్స్‌లో 7 ఫోర్లు, 1 సిక్స్ కొట్టి 51 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ 42 బాల్స్‌లో 1 ఫోరు, 3 సిక్సులు కొట్టి 56 పరుగులతో అద్భుత ఆరంభం ఇచ్చారు. కెప్టెన్ ఆక్సర్ పటేల్ 19 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. ఇతరులు కీలక సహకారం అందించారు. జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు తీసినా ఢిల్లీ స్థిరంగా ఛేజ్ పూర్తి చేసింది. అశుతోష్ శర్మ చివరి ఓవర్లలో సిక్స్‌తో మ్యాచ్‌ని ముగించాడని ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫో తెలిపింది. ఆక్సర్ పటేల్ (ఢిల్లీ) టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అరుణ్ జైట్లీ స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది, కానీ స్టార్క్ లాంటి బౌలర్లు డెత్ ఓవర్లలో ప్రభావం చూపారు. వాతావరణం హాట్ ఉ డ్రైగా కనిపించింది. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ 13 మ్యాచుల్లో 6 విన్నింగ్స్‌తో 12 పాయింట్లు సాధించి 7వ స్థానంలో ఉంది. రన్ రేట్ -0.871. రాజస్థాన్ రాయల్స్ 12 పాయింట్లతో 6వ స్థానంలో ఉంది. ఈ జట్టు 12 మ్యాచ్‌లు ఆడి 6 గెలిచింది. రాజస్థాన్ బ్యాటింగ్ ఆరంభంలో బాగుంది కానీ మిడిల్ ఓవర్లలో.. స్టార్క్ స్టార్మ్ ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తియ్యడం వల్ల చిక్కుల్లో పడింది. ఢిల్లీ బ్యాటింగ్ డెప్త్, ఫినిషింగ్ సామర్థ్యం గెలుపును తెచ్చిపెట్టాయి. రెండు జట్ల మధ్య పోటీ తీవ్రంగా కనిపించింది. ఇది సీజన్‌లో కీలక మ్యాచ్‌లలో ఒకటి. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ కూడా ఆటను ప్రభావితం చేసిందని ఎన్డీటీవీ స్పోర్ట్స్ రిపోర్ట్ చేసింది.

## రవీంద్ర జడేజా ఆడకపోవడంపై విమర్శలు

ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు రాజస్థాన్ రాయల్స్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆడకపోవడం ఇప్పుడు అనేక ప్రశ్నలు, అనుమానాలకు తావిచ్చింది. హాట్ డిబేట్ కు తెర తీసింది. ప్లేఆఫ్స్ చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్ కు డుమ్మా కొట్టడం పట్ల విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. మేనేజ్మెంట్ వ్యూహాత్మకంగా అతన్ని తప్పించిందా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. రవీంద్ర జడేజా ఆడకపోవడం పట్ల ఇంగ్లాండ్ మాజీ కేప్టెన్ మైఖెల్ వాన్ ఈ అనుమానాలు లేవనెత్తారు. అతను ఎందుకు దూరమయ్యాడని ప్రశ్నించారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ కారణంగా రవీంద్ర జడేజా విశ్రాంతి తీసుకుంటున్నాడని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చెప్పినప్పటికీ, దీనికి వేరే కారణం ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ అనేది సమస్యే కాదని తేల్చి చెప్పారు. రవీంద్ర జడేజాకు ఏం జరిగిందో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది. చిన్నపాటి సమస్యకు అతను మ్యాచ్ నుంచి తప్పుకోడు. విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా పనిభార నిర్వహణ పేరు చెప్పడం వింత. అతనికి ఏదో సమస్య ఉందనేది స్పష్టం. అతను మ్యాచ్ ఆడాలని కోరుకుంటున్నా.." అని పేర్కొన్నారు. బ్యాటింగ్ పతనం కాకుండా జడేజా అడ్డుకునేవాడని, మిచెల్ స్టార్క్‌పై భారీ షాట్లతో ఎదురుదాడికి దిగేవాడని తేల్చి చెప్పారు.

## కోల్‌కతా మేనేజ్‌మెంట్‌పై బీసీసీఐ సీరియస్!

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ కీలక ఘట్టానికి చేరుకుంటున్న వేళ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు మేనేజ్‌మెంట్‌ను ఒక సరికొత్త వివాదం చుట్టుముట్టింది. శనివారం గుజరాత్ టైటాన్స్   జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ ప్రధాన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయంతో తీవ్రంగా ఇబ్బంది పడినప్పటికీ, అతనితో బలవంతంగా మ్యాచ్‌ను కొనసాగించడం ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీల గెలుపోటముల కంటే దేశీయ ఆటగాళ్ల ఫిట్‌నెస్, భద్రత ముఖ్యమని భావించే భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఈ వ్యవహారాన్ని చాలా తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న సమయంలో వరుణ్ చక్రవర్తి పాదానికి  గాయమైంది. సాధారణంగా ఆటగాడికి గాయమైతే వెంటనే మైదానం వెలుపలికి పంపి ఫిజియో పర్యవేక్షణలో ఉంచాలి. కానీ కేకేఆర్ కెప్టెన్ మరియు మేనేజ్‌మెంట్ మాత్రం వరుణ్ చక్రవర్తితో అతని నాలుగు ఓవర్ల పూర్తి కోటాను వేయించింది. బంతిని విసిరిన ప్రతిసారీ, రనప్ సమయంలోనూ వరుణ్ తీవ్రమైన నొప్పితో నడవలేక ఇబ్బంది పడటం లైవ్ టెలికాస్ట్ వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. సోషల్ మీడియాలో ఈ వీడియో క్లిప్స్ వైరల్‌గా మారడంతో, కేకేఆర్ జట్టు మేనేజ్‌మెంట్ కేవలం మ్యాచ్ గెలవడం కోసమే ఆటగాడి కెరీర్‌ను రిస్క్‌లో పడేసిందంటూ నెటిజన్లు, మాజీ క్రికెటర్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై బీసీసీఐ ఉన్నతాధికారులు మరియు నేషనల్ క్రికెట్ అకాడమీ  వైద్య బృందం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఢిల్లీ వర్గాల ద్వారా తెలిసింది. వరుణ్ చక్రవర్తి బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టు (  లో ఉన్న ఆటగాడు. బోర్డు నిబంధనల ప్రకారం.. కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లకు ఐపీఎల్ సమయంలో ఎలాంటి




ఫిట్‌నెస్ సమస్యలు లేదా గాయాలు తలెత్తినా ఫ్రాంచైజీలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. గాయం తీవ్రతను దాచిపెట్టి లేదా నొప్పిని భరిస్తూ ఆటగాళ్లను మైదానంలోకి దించడం నిబంధనలకు విరుద్ధం. రాబోయే అంతర్జాతీయ సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని, ఆటగాళ్ల 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్'ను పర్యవేక్షించే బాధ్యత ఎన్‌సీఏ పరిధిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో కేకేఆర్ ఫ్రాంచైజీ వరుణ్ చక్రవర్తి శారీరక ఫిట్‌నెస్‌ను నిర్లక్ష్యం చేయడంపై బోర్డు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు అంతర్గత సమాచారం. బీసీసీఐ జోక్యం చేసుకోవడం మరియు బోర్డు నుండి గట్టి హెచ్చరికలు రావడంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ మేనేజ్‌మెంట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వరుణ్ చక్రవర్తి పాదానికి తగిలిన గాయం మరింత తీవ్రం కాకుండా ఉండేందుకు, అతనికి రాబోయే కొన్ని మ్యాచ్‌ల పాటు పూర్తి విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో కేకేఆర్ ఆడబోయే తదుపరి కీలకమైన మ్యాచ్‌కు వరుణ్ చక్రవర్తి ప్లేయింగ్ ఎలెవన్ (తుది జట్టు) కు దూరం కావడం దాదాపు ఖాయమైంది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతున్న తరుణంలో తమ ప్రధాన వికెట్ టేకింగ్ స్పిన్నర్ గాయం బారిన పడటం, అది వివాదాస్పదంగా మారడం కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి.